
సోమవారం 30, డిసెంబర్ 2024

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


## కాలుష్యకారక పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టండి

- పీసీబీ అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ ఆదేశం

4

# కరువు రహితంగా రాష్ట్రం





*- ఇరిగేషన్ శాఖపై ఉండవల్లి నివాసంలో ముఖ్యమంత్రి సమీక్ష*

## కూటమి ప్రభుత్వం ప్రణాళికలు

- వరదల కాలంలో గోదావరి జలాలు బనకచర్లకు తరలించే భారీ ప్రాజెక్టుకు రూపకల్పన
- కృష్ణాడెల్టాకు, సీమకు 280 టీఎంసీలు తరలించేందుకు ప్రణాళిక
- దాదాపు రూ.70,000 - 80,000 కోట్ల ప్రాజెక్టుతో రాష్ట్రానికి జలహారతి
- పోలవరం పూర్తితో 80 లక్షల మందికి తాగునీరు, 7.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు
- 22.5 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ

2



## మన హంపి..

# చదరంగం రారాణి!

- వరల్డ్ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్ షిప్ కైవసం
- 8.5 పాయింట్లతో ఇండోనేషియా ప్లేయర్‌పై విజయం
- మహిళల విభాగంలో రెండోసారి ఈ ఘనత సాధించి రికార్డు
- ఐదో స్థానంలో ద్రోణవల్లి హారిక

3

### దేశానికే గర్వకారణం

- సీఎం చంద్రబాబు అభినందనలు

### చెస్ లెజెండ్ హంపి

- మంత్రి లోకేష్ ప్రశంసలు
- మరిన్ని విజయాలు సాధించాలి
- యువతకు స్ఫూర్తిగా నిలవాలి

### అసాధారణ నైపుణ్యానికి దక్కిన అద్భుత విజయం

- హంపికి భువనేశ్వరి అభినందనలు

## టీడీపీ సభ్యత్వ నమోదులో..

# చరిత్ర సృష్టించిన మంగళగిరి

- లక్ష మార్క్ దాటిన సభ్యత్వాలు
- నియోజకవర్గ చరిత్రలోనే రికార్డ్
- శాశ్వత సభ్యత్వాల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానం
- స్వచ్ఛందంగా ముందుకొచ్చి సభ్యత్వం స్వీకరిస్తున్న ప్రజలు
- సభ్యత్వాలు తీసుకున్న వారికి నాయకుల అభినందనలు

2







# రేపు పల్నాడు జిల్లాకు సీఎం చంద్రబాబు

- యల్లమంద గ్రామంలో లబ్ధిదారులకు పించన్ల పంపిణీ
- అనంతరం వారితో మాటామంతీ
- అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం
- కోటప్పకొండలో స్వామివారి దర్శనం

3



# పేర్ని నానికి ఇకపై నిద్రలేని రాత్రులే



- పందికొక్కులా బియ్యం బొక్కి నీతి కబుర్లా
- తల్లకిందులుగా తపస్సు చేసినా తప్పించుకోలేరు
- భార్య పేరు వాడుకుని సానుభూతి పొందాలనుకోవడం సిగ్గు చేటు
- బియ్యం కుంభకోణం సూత్రధారి, పాత్రధారి పేర్ని నానియే
- మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజం

5

### పేర్ని..చేసిన తప్పు ఒప్పుకో

- టీడీపీ నేత బుద్దా వెంకన్న ఫైర్



### అప్పుడు ఇంట్లో ఆడవాళ్లు గుర్తు రాలేదా?

- పేర్ని నానికి జేసీ కౌంటర్



## విద్యుత్ రంగాన్ని విధ్వంసం చేసి..

# ఇప్పుడు రోడ్లెక్కి ధర్నాలా?



- జగన్‌రెడ్డిపై సోమిరెడ్డి ధ్వజం
- ఐదేళ్ల దోపిడీ ఫలితం.. విద్యుత్ సంస్థలపై రూ.1.29 లక్షల కోట్ల భారం
- అవినీతిలో అంతర్జాతీయ స్థాయికి జగన్ పేరు

4

## దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం

# 179 మంది దుర్మరణం

- రన్వేపై అదుపు తప్పి గోడను ఢీకొట్టి పేలిన విమానం
- ల్యాండింగ్ గేర్ వైఫల్యంతోనే ప్రమాదం

12




# కరువు రహితంగా రాష్ట్రం

## కూటమి ప్రభుత్వం ప్రణాళికలు

- వరదల కాలంలో గోదావరి జలాలు బనకచర్లకు తరలించే భారీ ప్రాజెక్టుకు రూపకల్పన
- కృష్ణాడెల్టాకు, సీమకు 280 టీఎంసీలు తరలించేందుకు ప్రణాళిక
- దాదాపు రూ.70,000 - 80,000 కోట్ల ప్రాజెక్టుతో రాష్ట్రానికి జలహారతి
- పోలవరం పూర్తితో 80 లక్షల మందికి తాగునీరు, 7.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు
- 22.5 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ
- ఇరిగేషన్ శాఖపై ఉండవల్లి నివాసంలో ముఖ్యమంత్రి సమీక్ష





అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీళ్లిచ్చి, రాష్ట్రాన్ని 100 శాతం కరువు రహిత రాష్ట్రంగా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు భారీ ప్రణాళికలను అమలు చేయబోతున్నారు. ఒకవైపు పోలవరం పూర్తి చేయడం ద్వారా 8 ఉమ్మడి జిల్లాలకు మేలు జరుగుతుంది. పోలవరంతో ఉత్తారంధ్రలోని మూడు ఉమ్మడి జిల్లాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు లబ్ధి చేకూరుతుంది. అయితే గోదావరి నదిలో వరదల సమయంలో సరాసరి ఏటా 2 నుంచి 3 వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలుస్తోంది. ఈ నీటి నుంచి 280 టీఎంసీలను వరదల సమయంలో తీసుకోవడం ద్వారా... కృష్ణా డెల్టాకు, రాయలసీమ లోని నాలుగు ఉమ్మడి జిల్లాలు సహా ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు లబ్ధి చేకూర్చేందుకు సీఎం చంద్రబాబు కార్యచరణ అమలు చేయబోతున్నారు. రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చేందుకు గోదావరి నీటిని బనకచర్లకు తరలించడమే ఏకైక మార్గం అని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. అందులో భాగంగానే గోదావరి వరద జలాలను తరలించడం ద్వారా రాష్ట్రానికి జలహారం కింద అన్ని ప్రాంతాల నీటి అవసరాలు తీర్చనున్నారు. అటు పోలవరం, ఇటు ఈ కొత్త ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో ప్రతి ఎకరానికి నీళ్లిచ్చే అవకాశం ఏర్పడుతుంది. ప్రభుత్వం ఏర్పడ్డాక 6 నెలలుగా దీనిపై విస్తృత కసరత్తు చేస్తున్న ప్రభుత్వం...ప్రాజెక్టును కార్యరూపం ఇచ్చే విషయంలో కీలక అడుగులు వేస్తోంది. ఉండవల్లిలోని తన నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టుపై ఆదివారం ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

### ప్రాజెక్టు వివరాలు

ఈ భారీ ప్రాజెక్టు ద్వారా విస్తృత స్థాయిలో రాష్ట్ర రైతాంగానికి, ప్రజలకు, పరిశ్రమలకు మేలు జరగబోతోంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే 80 లక్షల మందికి తాగునీరు, 7.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు కొత్తగా సాగునీరు అందుతుంది. దీనితో పాటు 22.5 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చు. పరిశ్రమలకు దాదాపు 20 టీఎంసీల నీటిని వినియోగించవచ్చు. ఎగువ రాష్ట్రాల్లో ఉన్న ప్రాజెక్టుల కారణంగా కృష్ణా నదికి తగిన విధంగా నీటి ప్రవాహాలు రావడం లేదు. మరో వైపు గోదావరి నదిలో ప్రతి ఏడాది వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలుస్తోంది. ఈ నీటిలో కనీసం 280 టీఎంసీల నీటిని వరద సమయంలో వినియోగించుకోవాలనేది ఈ ప్రాజెక్టు లక్ష్యం. దీని కోసం రెండుమూడు రకాల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గోదావరి నీటిని కృష్ణా నదికి తరలిస్తారు. కృష్ణా నది నుంచి నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా బొల్లాపల్లి రిజర్వాయర్‌కు తరలిస్తారు. అక్కడ 200 టీఎంసీల సామర్థ్యంతో బొల్లాపల్లి రిజర్వాయర్ నిర్మిస్తారు. అక్కడి నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు నీటికి తరలిస్తారు. బొల్లాపల్లి నుంచి బనకచర్లకు 31 కి.మీ టన్నెల్ ద్వారా నీటిని తరలిస్తారు. బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ నుంచి తెలుగుగంగ, ఎస్సార్‌బీసీ, నిప్పుల వాగుకు నీళ్ళు వెళతాయి. నిప్పుల వాగు ద్వారా సోమశిల, కండలేరుకు నీటిని తరలిస్తారు. ఇప్పుడు ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చే నీటిని వివిధ లిఫ్టులు, కాలువల ద్వారా అన్ని ప్రాజెక్టులకు తరలిస్తారు.

### ఇటు కృష్ణా డెల్టాకు, అటు సీమకు...

ఈ ప్రాజెక్టు పూర్తైతే ఎంత దుర్భర పరిస్థితులున్నా సీమ జిల్లాలకు, పెన్నా ద్వారా నెల్లూరుకు నీరు ఇవ్వొచ్చు. ఈ ప్రాజెక్టు ద్వారా నాగార్జున సాగర్ కుడికాలువ కింద సాగయ్యే పంటలకు కూడా సమృద్ధిగా నీటిని అందజేయవచ్చు. అలాగే ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కరువు ప్రాంతంగా ఉన్న వెలుగొండ ప్రాజెక్టు నీటి అసవరాలను కూడా తీర్చవచ్చు. గోదావరిలో వరద సమయంలో 280 టీఎంసీల నీటిని సీమకు తరలిస్తారు. పోలవరం ప్రాజెక్టు ఎగువ నుంచి రోజుకు మూడు టీఎంసీల నీటిని తరలిస్తారు. ఒక టీఎంసీ నీళ్లు కృష్ణా డెల్టాకు ఇస్తారు. అంటే 280 టీఎంసీల్లో కనీసం 80 టీఎంసీల నీరు కృష్ణా డెల్టాకు కేటాయిస్తారు. ఈ స్థాయిలో నీటిని గోదావరి నుంచి తరలించాలంటే పోలవరం కుడికాలువ సామర్థ్యాన్ని పెంచాల్సి ఉంటుంది. పోలవరం కుడికాలువను 17 వేల క్యూసెక్కుల సామర్థ్యం నుంచి 28 వేల నుంచి 30 వేల క్యూసెక్కులకు పెంచుతారు. అదే విధంగా తాడిపూడి లిఫ్ట్ స్కీమ్ కాలువ సామర్థ్యాన్ని కూడా 1500 క్యూసెక్కుల నుంచి 10 వేల క్యూసెక్కులకు పెంచి నీటిని తరలిస్తారు. కేవలం గోదావరికి వరదల సమయంలోనే నీటిని తీసుకోవడం ద్వారా....సముద్రంలో వృథాగా పోయే నీటిని మాత్రమే తీసుకోవడం వల్ల ఈ కొత్త ప్రాజెక్టు వల్ల గోదావరి డెల్టాకు నీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

### కేంద్ర ఆర్థిక సాయానికి ప్రయత్నాలు

ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఈ ప్రాజెక్టు చేపట్టడం అంత సులభం కాదు. అయితే ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే ఇదే పెద్ద గేమ్ ఛేంజర్ అవుతుందని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.70 వేల నుంచి రూ.80 వేల కోట్లు ఖర్చు అవుతుందని తెలుస్తోంది. 54 వేల ఎకరాల భూ సేకరణ జరపాల్సి ఉంటుంది. 4 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుంది. పెద్ద మొత్తంలో అటవీ భూములు కూడా సేకరించాల్సి ఉంటుంది. ఇవన్నీ జరగాలంటే భారీ వ్యయం అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇంత వ్యయం చేసే అవకాశం లేదు. దీంతో ఈ ప్రాజెక్టు అవసరాన్ని, ప్రయోజనాలను కేంద్రానికి వివరించిన కేంద్ర సాయం కూడా తీసుకుని దీన్ని పూర్తి చెయ్యాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ఈ వారంలో జరిపిన ఢిల్లీ పర్యటనలో కేంద్ర పెద్దలతో ఈ ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు చర్చించారు. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రాజెక్టు అవసరాన్ని వివరించి ఆర్థిక సాయంపై విన్నవించారు. సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టుకు అనుమతులు పొంది, టెండర్ల ప్రక్రియ పూర్తి చెయ్యాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్ర ప్రజల అవసరాల దృష్ట్యా అత్యంత వేగంగా, ప్రాధాన్యంతో ఈ ప్రాజెక్టు పూర్తి చెయ్యాలని భావిస్తున్నామని...అందులో భాగంగా ఈ ప్రాజెక్టుకు సంబంధించి అన్ని పనులు వేగంగా జరగాలని అధికారులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్‌తో పాటు ఇతర ఇరిగేషన్ శాఖ అధికారులు, సీఎంవో అధికారులు పాల్గొన్నారు.

---

టీడీపీ సభ్యత్వ నమోదులో..

# చరిత్ర సృష్టించిన మంగళగిరి

- లక్ష మార్క్ దాటిన సభ్యత్వాలు
- నియోజకవర్గ చరిత్రలోనే రికార్డ్
- శాశ్వత సభ్యత్వాల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానం
- స్వచ్ఛందంగా ముందుకొచ్చి సభ్యత్వం స్వీకరిస్తున్న ప్రజలు
- సభ్యత్వాలు తీసుకున్న నాయకుల అభినందనలు

మంగళగిరి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గం చరిత్ర సృష్టించింది. సభ్యత్వ నమోదులో లక్ష దాటించి గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొదటి స్థానంలో నిలిచింది. మంగళగిరి నియోజకవర్గ చరిత్రలోనే ఇది ఒక రికార్డు. అలాగే శాశ్వత సభ్యత్వాల్లో మంగళగిరి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 80 మంది నాయకులు రూ.1,00,000 చెల్లించి శాశ్వత సభ్యత్వాలు తీసుకున్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం అక్టోబర్ 26వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. రూ.100 సభ్యత్వంతో రూ. 5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది. మంత్రి నారా లోకేష్‌కు వచ్చిన మెజార్టీ లాగానే నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు అవుతాయని నాయకులు ముందుగానే అంచనా వేయగా ఇప్పటికే లక్ష సభ్యత్వాల మార్క్ దాటింది. మంగళగిరి నియోజకవర్గాన్ని మంత్రి నారా లోకేష్ దేశంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తారన్న నమ్మకంతో ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీ సభ్యత్వం తీసుకుంటున్నారు. అంతేకాకుండా ఈ సారి యువతీ యువకులు ఎక్కువగా సభ్యత్వం తీసుకునేందుకు ముందుకొస్తున్నారు. గతంలో జరిగిన సభ్యత్వ నమోదులో మంగళగిరి నియోజకవర్గంలో 51,951 వేలు నమోదు కాగా ఈ సారి లక్ష దాటించి గతంలో ఉన్న రికార్డును తిరగరాసింది. నియోజవర్గంలో 2,83,575 లక్షల ఓటర్లు ఉండగా ఆదివారం సాయంత్రం నాటికి మొత్తంగా నియోజకవర్గంలో 1,00,422 సభ్యత్వాలు నమోదైనట్టు పార్టీ వర్గాలు ప్రకటించాయి. రికార్డు స్థాయిలో జరిగిన సభ్యత్వంపై టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సభ్యత్వ నమోదుపై మంత్రి నారా లోకేష్.. పార్టీ శ్రేణులకు ఎటువంటి ఆదేశాలు ఇవ్వకపోయినా, పార్టీ నాయకులు ఎటువంటి సమావేశాలు నిర్వహించకపోయినా, ప్రజలు స్వచ్ఛందంగా సభ్యత్వాలు చేసుకోవడానికి ముందుకు రావడం గొప్ప విషయమని టీడీపీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. సభ్యత్వాలు పునరుద్ధరించుకున్న, కొత్త సభ్యత్వాలు తీసుకున్న సభ్యులకు ఆయా మండల, టౌన్ పార్టీ అధ్యక్షులు అభినందనలు తెలిపారు.

చైతన్యరథం

## మన హంపి..

# చదరంగం రారాణి!



- వరల్డ్ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్ షిప్ కైవసం
- 8.5 పాయింట్లతో ఇండోనేషియా ప్లేయర్‌పై విజయం
- మహిళల విభాగంలో రెండోసారి ఈ ఘనత సాధించి రికార్డు
- ఐదో స్థానంలో ద్రోణవల్లి హారిక

అమరావతి (చైతన్యరథం): తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి అద్భుతమైన ఘనత సాధించింది. అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగిన ఫిడే వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్ మహిళల విభాగంలో గెలుపొంది హంపీ చరిత్ర సృష్టించారు. ఈ పోటీల్లో ఆమె 8.5 పాయింట్లతో ప్రత్యర్థి అయిన ఇండోనేషియా ప్లేయర్ ఇరిన్ ఖరిష్మా సుకందర్‌పై ఆమె విజయం సాధించారు. ఉత్కంఠగా సాగిన పదకొండో రౌండ్‌లో కోనేరు హంపి గెలుపొంది భారత గౌరవాన్ని మరింత పెంచారు. ఇది ఆమెకు రెండో ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్. 2019లో మాస్కో వేదికగా జరిగిన మహిళల ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్‌ను సైతం కోనేరు సొంతం చేసుకున్నారు. మహిళల విభాగంలో ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌గా రెండుసార్లు గెలిచి కోనేరు హంపి రికార్డు సృష్టించారు. చైనా గ్రాండ్ మాస్టర్ జు వెంజున్ తర్వాత ఒకటి కంటే ఎక్కువసార్లు విజేతగా నిలిచిన ప్లేయర్ హంపి ఘనత సాధించింది. మరో తెలుగు గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక ఐదో స్థానంలో నిలిచింది.

**పురుషుల విభాగంలో..**

తొమ్మిది రౌండ్లు ముగిసేసరికి అగ్రస్థానంలో ఉన్న భారత గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేశి చివర్లలో వెనుకబడిపోయాడు. పురుషుల ర్యాపిడ్ ఈవెంట్లో 18 ఏళ్ల వోలాదర్ ముర్జిన్ విజేతగా నిలిచాడు. రష్యాకు చెందిన ఈ యువ గ్రాండ్ మాస్టర్ 10 పాయిట్లు సాధించి ఛాంపియన్‌గా అవతరించాడు. అర్జున్ (9 పాయింట్లు) ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

**చాలా సంతోషంగా ఉంది: హంపి**

గెలుపొందిన అనంతరం కోనేరు హంపి మాట్లాడుతూ ఆనందం వ్యక్తం చేశారు. "చాలా సంతోషంగా ఉంది. నిజానికి, ఇది టై-బ్రేక్ వంటి చాలా కఠినమైన రోజు అని అనుకున్నాను. ఆట పూర్తయిన క్షణంలో భావోద్వేగానికి లోనయ్యాను. మొదటి రౌండ్‌లో ఓటమి తర్వాత నాకు టైటిల్ వస్తుందని అస్సలు అనుకోలేదు. అయితే.. వరుసగా నాలుగు గేములను గెలవడం చాలా సహాయపడింది. నా గెలుపు, ప్రపంచ ఛాంపియన్‌గా గుకేష్ విజయం భారతీయులను చెస్ వైపు ప్రోత్సహిత్సాయని అనుకుంటున్నానని అని ఆమె అన్నారు. యువత చెస్‌ను తమ ప్రొఫెషన్‌గా తీసుకోవాలని కోరారు.

**చెస్‌లో దూసుకుపోతున్న భారత్**


ఈ ఏడాది సెప్టెంబర్లో బుడాపెస్ట్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్లో ఓపెన్, మహిళల విభాగాల్లో భారత్ తొలిసారిగా బంగారు పతకాలు సాధించింది. ఇటీవల తమిళనాడుకు చెందిన దొమ్మరాజు గుకేశ్ ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్‌ను సొంతం చేసుకున్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్ (చైనా) తో జరిగిన తుది పోరులో విజేతగా నిలిచాడు. ప్రపంచ చెస్ ఛాంపియన్ అయిన అతిపిన్న వయస్కుడిగా గుకేశ్ రికార్డు సృష్టించాడు. కోనేరు హంపి ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్ షిప్‌ను రెండోసారి సొంతం చేసుకుంది.

**గర్వించేలా చేశారు: ఆరంద్ మహీంద్రా**

తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ర్యాపిడ్ ఛాంపియన్‌గా నిలవడంపై ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా ఆనందం వ్యక్తం చేశారు. "ఒక 'భారత రాణి' చెస్ బోర్డును శాసించారు. కోనేరు హంపి తన అద్భుతమైన ఆట తీరుతో మమ్మల్ని ఎంతో గర్వించేలా చేశారు. భారత చెస్‌కు అద్భుతమైన సంవత్సరంగా నిలిచిన ఈ ఏడాదికి విజయవంతమైన ముగింపును అందించినందుకు కృతజ్ఞతలు..అంటూ మహీంద్రా సోషల్ మీడియా వేదికగా ప్రశంసలు కురిపించారు.

## దేశానికే గర్వకారణం

**- సీఎం చంద్రబాబు అభినందనలు**



అమరావతి (చైతన్యరథం): ఫిడే మహిళల ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన కోనేరు హంపికి ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. 2024.. మన దేశ చెస్ క్రీడాకారులకు మరిచిపోలేని సంవత్సరం అన్నారు. కోనేరు హంపి విజయం దేశానికే గర్వకారణమని కొనియాడారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. అద్భుతమైన విజయంతో దేశ ప్రతిష్టను పెంపొందించిదని ప్రశంసించారు.

## చెస్ లెజెండ్ హంపి



**- మంత్రి లోకేష్ ప్రశంసలు**
**- మరిన్ని విజయాలు సాధించాలి**
**- యువతకు స్ఫూర్తిగా నిలవాలి**

అమరావతి (చైతన్యరథం): అసాధారణమైన పట్టుదల, సంకల్పం, నైపుణ్యం హంపి సొంతమని రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి లోకేశ్ అభినందించారు. ఫిడే మహిళల ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌గా కోనేరు హంపి విజయం సాధించటంపై మంత్రి లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హంపిని అభినందిస్తూ ట్వీట్ చేశారు. 2024 ఫిడే మహిళల ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌గా కోనేరు హంపి కిరీటాన్ని కైవసం చేసుకోవడం ఆనందంగా ఉంది. ఈ అసాధారణమైన ఫీట్.. మీ పట్టుదల, సంకల్పం, ఆటలో నైపుణ్యానికి అద్దం పడుతోంది. హంపి మరిన్ని విజయాలు సాధించి యువతకు స్ఫూర్తిని ఇవ్వాలి. మీరు నిజమైన భారతీయ చెస్ లెజెండ్" అంటూ లోకేష్ కొనియాడారు.

## అసాధారణ నైపుణ్యానికి అద్భుత విజయం

**- హంపికి భువనేశ్వరి అభినందనలు**



అమరావతి (చైతన్యరథం): మహిళల ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్న కోనేరు హంపికి సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మీ అసాధారణ నైపుణ్యం, ఏకాగ్రత, సంకల్పంతో ఈ ఘన విజయం సాధించారని కొనియాడారు. మీ కృషి, ప్రతిభకు ఈ విజయమే నిదర్శనం. యువతకు స్ఫూర్తినిచ్చేలా చెస్‌లో విజయాల పరంపర కొనసాగాలని ఆకాంక్షించారు.

# మధుర క్షణాలను చక్కగా ఒడిసిపట్టారు!

- నితీష్ కుటుంబ సభ్యుల భావోద్వేగాల వీడియోపై భువనేశ్వరి స్పందన
- వీడియోను ఎక్స్‌లో షేర్ చేసి అభినందనలు తెలిపిన వైనం
- సెంచరీతో తెలుగువారి ప్రతిష్ట పెంచారని నితీష్‌కు ప్రశంసలు
- కుటుంబసభ్యుల త్యాగాలకు అద్భుతమైన నజరానా అందించారని మెచ్చుకోలు

అమరావతి (చైతన్యరథం): క్రికెటర్ నితీష్‌కుమార్‌రెడ్డి, కుటుంబసభ్యులను సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి అభినందించారు. నితీష్‌కుమార్‌రెడ్డి కుటుంబసభ్యులతో పంచుకున్న ఆనంద క్షణాలను ట్విట్టర్(ఎక్స్) వేదికగా గుర్తుచేసుకున్నారు.

తెలుగుతేజం నితీశ్ కుమార్ రెడ్డి ఆస్ట్రేలియా గడ్డపై సాధించిన సెంచరీ అందరినీ ఆకట్టుకుంది. తండ్రి కలను నెరవేరుస్తూ అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన నితీష్ కుమార్ రెడ్డి... మెల్బోర్న్ టెస్టులో సెంచరీ ద్వారా తన ఆగమనాన్ని ఘనంగా చాటాడు. మూడో రోజు ఆట ముగిసిన అనంతరం నితీష్‌ను అతడి తల్లిదండ్రులు, సోదరి హెూటల్ కు వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా వారి మధ్య భావోద్వేగాలు ఉప్పొంగాయి. దీనికి సంబంధించిన వీడియోను బీసీసీఐ పోస్టు చేయగా... దీనిపై భువనేశ్వరి స్పందించారు. కుటుంబ సభ్యుల మధ్య మధుర క్షణాలను ఈ అందమైన వీడియోలో చక్కగా ఒడిసిపట్టారని ఆమె ట్వీట్ చేశారు.

మన యువ తార నితీష్ కుమార్ రెడ్డి అద్భుత సెంచరీ పట్ల అందరం గర్విస్తున్నాం. అతడు సాధించిన ఘనత చిన్నదేమీ కాదు. తద్వారా తన కుటుంబాన్ని గర్వించేలా చేశాడు. కుటుంబ సభ్యులు చేసిన త్యాగాలకు తన సెంచరీ ద్వారా తగిన నజరానా అందించాడు. బిడ్డ కలను నిజం చేయడానికి ఎల్లవేళలా మద్దతుగా నిలుస్తూ ప్రతి దశలోనూ తోడుగా ఉన్న అతడి తల్లిదండ్రులకు శుభాభినందనలు. అంతేకాదు, అతి పెద్ద కుటుంబంగా పేర్కొనే మన తెలుగు సమాజాన్ని నితీష్ గర్వపడేలా చేశాడు. భవిష్యత్తులోనూ ఇదే విధంగా విజయ ప్రస్థానం కొనసాగించాలని కోరుకుంటున్నానంటూ భువనేశ్వరి దీవెనలు అందజేశారు. అంతేకాదు, బీసీసీఐ పోస్టు చేసిన వీడియోను కూడా ఆమె షేర్ చేశారు.

# రేపు పల్నాడు జిల్లాకు సీఎం చంద్రబాబు

- యల్లమంద గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ
- అనంతరం వారితో మాటామంతీ
- అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం
- కోటప్పకొండలో స్వామివారి దర్శనం

అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 31న పల్నాడు జిల్లా, నరసరావుపేట నియోజకవర్గం, యల్లమంద గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి పల్నాడు జిల్లాకు బయలుదేరి 10.50 గంటలకు నరసరావుపేట మండలం, యల్లమంద గ్రామానికి చేరుకుంటారు. 11.00 - 11.30 గంటల మధ్య లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారు. 11.35-12.35 వరకు లబ్ధిదారులతో ముచ్చటిస్తారు. మధ్యాహ్నం 12.40-1.00 వరకు పల్నాడు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. 1.45 గంటలకు కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. 2.55 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు.

చైతన్యరథం



# కాలుష్యకారక పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టండి

**- పీసీబీ అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ ఆదేశం**

కాకినాడ (చైతన్యరథం): కాకినాడ తీరంలో కాలుష్యకారక దుర్గంధం వెలువరిస్తున్న పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. వాకలపూడి ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న యూనివర్సల్ బయోఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నుంచి కాలుష్యకారక దుర్గంధం వెలువడడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా సంస్థ నుంచి ఘాటైన, దుర్గంధపూరిత వాయువులు విడుదల విషయంపై ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ, అటవీ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పందించారు. పీసీబీ ఛైర్మన్ కృష్ణయ్య, పీసీబీ కాకినాడ రీజనల్ ఆఫీసర్ శంకరరావుతో ఫోన్లో మాట్లాడారు. యూనివర్సల్ బయోఫ్యూయల్స్ సంస్థ కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తుందో.. లేదో పరిశీలించి తక్షణమే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలకు వాయు కాలుష్య సమస్యలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పరిశీలన చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ముడి పదార్థాలు వాడుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఫలితంగా ఘాటైన, దుర్గంధపూరిత వాయువులు వెలువడుతున్నాయని తేలింది. దీనిపై మరింత లోతుగా తనిఖీలు చేస్తున్నట్లు అధికారులు తెలియచేశారు.

**ఆలివ్ రిడ్లీ తాబేళ్ల మరణంపై విచారణ**

కాకినాడ బీచ్ రోడ్, ఏపీఐఐసీ, వాకలపూడి ప్రాంతాల్లో అరుదైన ఆలివ్ రిడ్లీ తాబేళ్ళు అత్యధిక సంఖ్యలో మరణిస్తున్న విషయమై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించారు. ఆలివ్ రిడ్లీ తాబేళ్ళ మరణానికి దారితీస్తున్న పరిస్థితులపై విచారణ జరిపి, కారకులపై చర్యలు చేపట్టాలని, వన్యప్రాణుల పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలపై సమగ్ర అధ్యయనం చేయాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ చిరంజీవి చౌదరిని పవన్ ఆదేశించారు.

# పేదల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

**- మంత్రి కొలుసు పార్థసారధి స్పష్టీకరణ**

**- ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం**

**- మణిపాల్ హాస్పటల్, జివిఆర్ ట్రస్ట్ సేవలు హర్షదాయకం**

నూజివీడు (చైతన్యరథం): గ్రామీణ ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం చాట్రాయి మండలం చిన్నంపేట గ్రామంలో విజయవాడ మణిపాల్ హాస్పటల్, జివిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంత్రి కొలుసు పార్థసారధి ప్రారంభించారు. వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన సాధారణ వైద్య పరీక్షలు, క్యాన్సర్ పరీక్షలు, కంటి పరీక్ష, గుండె పరీక్ష, ఊపిరితిత్తుల, పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. వైద్య పరీక్షల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులను పలకరించి వారు ఆరోగ్య పరిస్థితులను ఆరా తీశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా పేదలు మెరుగైన వైద్యానికి దూరం కాకూడదనేదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేద ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కొన్ని రోగాలకు ఎన్టీఆర్ వైద్య సేవలో చికిత్సకు అవకాశం ఉన్నప్పటికి వాటిపై సరైన అవగాహన లేని కారణంగా ప్రైవేటుగా వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ప్రతీ ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక సహాయం అందచేసి అన్నివిధాలుగా ఆదుకుంటామన్నారు. ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సేవాసంస్థలు నిర్వహిస్తున్న ఈ మెగా వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన మణిపాల్ హాస్పటల్, జివిఆర్ ట్రస్ట్‌లకు మంత్రి పార్థసారధి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుకు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆయన కోరారు. చిన్న రుగ్మతలను కూడా నిర్లక్ష్యం చేయకుండా ముందుగానే వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. ప్రజల ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఇంటింటికి సర్వే చేయించి రోగ నిర్ధారణ, నిరోధక చర్యలు చేపడుతుందన్నారు. గత ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించిందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధినుండి ఒక్క రూపాయి కూడా పేద ప్రజలకు అందజేయలేదని విమర్శించారు. పేద ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటి నెరవేరుస్తున్న ప్రభుత్వము తమదని చెప్పారు. ప్రజలు తమపై నమ్మకం ఉంచి అందించిన విజయాన్ని బాధ్యతగా భావిస్తున్నామన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు.

కార్యక్రమంలో మణిపాల్ హాస్పటల్, జివిఆర్ ట్రస్ట్ ప్రతినిధులు, వైద్యులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.










## విద్యుత్ రంగాన్ని విధ్వంసం చేసి..

# ఇప్పుడు రోడ్లెక్కి ధర్నాలా?

**- జగన్‌రెడ్డిపై సోమిరెడ్డి ధ్వజం**

**- ఐదేళ్ల దోపిడీ ఫలితం.. విద్యుత్ సంస్థలపై రూ.1.29 లక్షల కోట్ల భారం**

**- అవినీతిలో అంతర్జాతీయ స్థాయికి జగన్ పేరు**

నెల్లూరు (చైతన్యరథం): దేశ చరిత్రలోనే జగన్ రెడ్డిలా అవినీతికి పాల్పడిన ముఖ్యమంత్రి మరొకరు లేరని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. ఐదేళ్ల పాలనలో విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ ధర్నాల పేరుతో రోడ్డెక్కడం సిగ్గు చేటని దుయ్యబట్టారు. నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం మీడియాతో సోమిరెడ్డి మాట్లాడుతూ కరెంట్ చార్జీల విషయంలో వైసీపీ వాళ్లు రోడ్డెక్కి ధర్నాలు చేయడం చూస్తుంటే.. నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. జగన్ రెడ్డి రూ.1.29 లక్షల కోట్ల భారాన్ని విద్యుత్ సంస్థలపై మోపి ఎన్నికల్లో ఘోరంగా ఓడి ఇంటికి పోయాడు. ఐదేళ్లలో 10 సార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారాన్ని మోపాడు. 2014లో చంద్రబాబు నాయుడు సీఎంగా బాధ్యతలు చేపట్టేనాటికి రాష్ట్రంలో 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఉంది. 2019లో చంద్రబాబునాయుడు అధికారం కోల్పోయే నాటికి లోటును అధిగమించి మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దారు. జగన్ రెడ్డి తాను చేసిన పాపాలను మరో 30ఏళ్లు ప్రజలు అనుభవించాలంటున్నాడు. 7 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను యూనిట్ రూ.2.49 కొనుగోలు చేసేలా సెకీతో ఒప్పందం చేసుకున్నాడు.

అదే సమయంలో గుజరాత్ యూనిట్ రూ.1.99కే అగ్రిమెంట్ చేసుకుంది. మరో పదేళ్లకు సోలార్ విద్యుత్ యూనిట్ రూ.1.25కి వస్తుందని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. కానీ మన జగన్ రెడ్డి మాత్రం 30 ఏళ్ల పాటు రూ.2.49కే కొనుగోలు చేసేలా ఒప్పందం చేసుకుని వెళ్లాడు. ఆ ఒప్పందం పూర్తయ్యేసరికి ఆయన ముత్తాత అవుతాడు. జగన్ రెడ్డి బరితెగించి రూ.1750 కోట్లు లంచం తీసుకున్న పాపానికి ప్రజలపై అదనంగా లక్ష కోట్ల భారం పడుతోందని సోమిరెడ్డి విమర్శించారు.

**సిగ్గు లేకుండా..**

ఏపీ సీఎంగా జగన్ రెడ్డి లంచం తీసుకున్నాడని అమెరికాకు చెందిన అంతర్జాతీయ దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ వెల్లడించింది. అయినా సిగ్గులేకుండా జగన్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నాడు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను 30 ఏళ్ల గడువుకు తాకట్టుపెట్టి, ఇప్పుడు నిరసనల పేరుతో రోడ్డెక్కడానికి సిగ్గుండాలి. కేబినెట్ ఆమోదం లేకుండానే ఒప్పందాలు చేసి ప్రజలపై మోయలేని భారం మోపారు. జగన్మోహన్ రెడ్డి అత్యంత అవినీతిపరుడైన రాజకీయ నాయకుడిగా అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. ఒక్క పవర్ ప్లాంటు కూడా నిర్మించకుండానే విద్యుత్ సంస్థల పేరుతో రూ.49 వేల కోట్లు అప్పులు చేశాడు. జగన్ రెడ్డి చుట్టూ ఉండే నలుగురైదుగురు రెడ్లకు దోచిపెట్టడమే లక్ష్యంగా విద్యుత్ రంగంలో దోపిడీ జరిగింది. కృష్ణపట్నంలోని ఏపీ జెన్ కో థర్మల్ పవర్ ప్లాంటుకు రూ.281 కోట్ల విలువైన 4.50 లక్షల టన్నుల నాసిరకమైన బొగ్గును సరఫరా చేసి దోచుకున్నారు. మట్టితో కూడిన ఆ బొగ్గుతో ప్రాజెక్టు ఉనికికే ప్రమాదమని జెన్ కో ఉద్యోగులు తిరగబడే పరిస్థితి తెచ్చారు. జగన్ రెడ్డి అవినీతి దెబ్బకు అమెరికాలోని ఎఫ్‌బీఐ నుంచి నేలటూరులోని జెన్ కో ఉద్యోగుల వరకు రోడ్డెక్కారు. అయినా సిగ్గు, శరం లేకుండా నిరసనల పేరుతో ఊరేగింపులు చేసుకున్నారని సోమిరెడ్డి తప్పుబట్టారు.

**స్మార్ట్ మీటర్ల పేరుతో దోపిడీ**

స్మార్ట్ మీటర్ల విషయంలోనూ దేశంలోని ఏ రాష్ట్రంలో లేకుండా ఏపీలో పెట్టేందుకు అనుమతిచ్చిన ఘనుడు కూడా జగన్ రెడ్డే. ఒక్కో స్మార్ట్ మీటర్ కు రాజస్థాన్ లో రూ.7943, ఛండీగడ్‌లో రూ.9710 ఖర్చు చేస్తే ఏపీలో మాత్రం రూ.36975 ఖర్చుచేశారు. జగన్మోహన్ రెడ్డి లాంటి వ్యక్తిని ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నందుకు ఏపీ ప్రజలు జీవితకాలం బాధపడే పరిస్థితి తెచ్చిపెట్టారు. ఇంత బరితెగించి దోపిడీకి పాల్పడిన ముఖ్యమంత్రి దేశ చరిత్రలోనే లేరు. జగన్ ధనదాహంతో ఏపీలో ఐదేళ్ల పాటు వ్యవస్థలన్నింటినీ నాశనం చేసేశాడు. ఇలాంటి వ్యక్తులకు విద్యుత్ భారం పేరుతో ధర్నాలు, ప్రదర్శనలు చేసే నైతిక హక్కు లేదు. విద్యుత్ ఛార్జీల పేరెత్తే అర్హత కూడా వైసీపీ నాయకులకు లేదు. ప్రజలపై భారం ఎలా తగ్గించాలనే ఆలోచనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారని సోమిరెడ్డి స్పష్టం చేశారు.

# పేర్ని నానికి ఇకపై నిద్రలేని రాత్రులే

- పందికొక్కులా బియ్యం బొక్కి నీతి కబుర్లా
- తల్లకిందులుగా తపస్సు చేసినా తప్పించుకోలేరు
- భార్య పేరు వాడుకుని సానుభూతి పొందాలనుకోవడం సిగ్గు చేటు
- బియ్యం కుంభకోణం సూత్రధారి, పాత్రధారి పేర్ని నానియే
- మంత్రి కొల్లు ధ్వజం



మచిలీపట్నం (చైతన్యరథం): వైసీపీ నాయకుడు పేర్ని నాని తల్లకిందులుగా తపస్సు చేసినా బియ్యం కుంభకోణం నుంచి తప్పించుకోవడం సాధ్యం కాదని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మచిలీపట్నంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో ఆదివారం మీడియాతో మంత్రి కొల్లు మాట్లాడుతూ.. దొంగతనం చేసి డబ్బులు కట్టేసినంత మాత్రాన దొర అయిపోతారా అని ప్రశ్నించారు. పేదలకు చెందాల్సిన 7,577 బస్తాల బియ్యాన్ని పందికొక్కులా బొక్కి ఇప్పుడు నీతులు మాట్లాడ్డానికి సిగ్గుపడాలన్నారు. సీఎం చంద్రబాబు మమ్మల్ని ఏదో అన్నారంటూ అభూతకల్పనలతో డ్రామాలాడడానికి బుద్ధి ఉండాలని హెచ్చరించారు. భార్యపేరుతో గోదాము ఉన్నపుడు జాగ్రత్తగా ఉండాల్సింది పోయి.. బియ్యాన్ని బొక్కేసి మహిళలపై కేసులు పెడుతున్నారంటూ సానుభూతి డ్రామాలాడుతున్నారన్నారు. తప్పు చేస్తే మహిళల్ని అరెస్టు చేయకూడదని రాజ్యాంగంలో ఉందా అని ప్రశ్నించారు. మహిళల్ని అరెస్టు చేయొద్దంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు మమ్మల్ని వారించారని పేర్ని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. ఇలాంటి నీతిలేని రాజకీయం చేస్తున్నందుకు పేర్ని నాని సిగ్గుపడాలన్నారు. ఇంత నీచానికి తెగించిన పేర్ని నాని అసలు మనిషిపుట్టుక పుట్టాడా అని తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. భార్య పేరును వాడుకుని రాజకీయం చేయాలనుకోవడమే తప్పు, అలాంటిది ఆమె పేరు వాడుకుని సానుభూతి పొందాలనుకోవడం మరింత నీచం అన్నారు. ఈ బియ్యం కుంభకోణం మొత్తానికి సూత్రధారి, పాత్రధారి పేర్ని నానియే అన్నారు. పేర్ని నాని తలకిందులుగా తపస్సు చేసినా ఈ కేసు నుండి తప్పించుకోవడం అసాధ్యం అన్నారు. తప్పు చేశారు కాబట్టే నెల రోజులుగా కుటుంబం మొత్తం తప్పించుకు తిరుగుతోందని మంత్రి కొల్లు దుయ్యబట్టారు.

### ఈ బుద్ధి నాడేమయింది..

ఈ రోజు మహిళల ఆత్మగౌరవం, మహిళలపై కేసులు గురించి మాట్లాడుతున్న పేర్ని నాని నాడు అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి గురించి నీచంగా వ్యాఖ్యానించినపుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఆడబిడ్డలపై కేసులు పెట్టి, స్టేషన్ల చుట్టూ తిప్పి, జైల్లో పెట్టినపుడు ఆ గుణం ఏమైందో సమాధానం చెప్పాలన్నారు. వయసుతో సంబంధం లేకుండా వృద్ధుల్ని కూడా అరెస్టు చేసినపుడు పేర్ని నాని ఏ కలుగులో ఉన్నాడో సమాధానం చెప్పాలన్నారు. నోరుందని ఇష్టానుసారం వాగితే.. ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఐదేళ్ల పాటు చేసిన పాపాలు పండాయి, అందుకే ఈ రోజు ఇలా భయంతో వణుకుతున్నాడని ఎద్దేవా చేశారు. గోడౌన్ మేనేజరే మొత్తం చేశాడని చెబుతున్న పేర్ని నాని అతన్ని ఎందుకు దాచిపెట్టారో సమాధానం చెప్పాలన్నారు. గతంలో నా అనుచరుల కాళ్లు కట్టి వేలాడదీసి, నాపై కేసు నమోదు చేసినపుడు ఈ బుద్ధి ఏమైందో సమాధానం చెప్పాలన్నారు. అప్పుడు చేసిన తప్పులు, పాపాలు గుర్తొచ్చి ఇప్పుడు భయపడుతున్నారన్నారు. కర్మఫలం నుండి ఎవరూ తప్పించుకోలేరనే విషయాన్ని పేర్ని నాని గుర్తుంచుకోవాలన్నారు. భగవంతుడు క్షమించినా.. చేసిన పాపాలు వదలబోవు. నిద్రలేని రాత్రులు తప్పవని మంత్రి కొల్లు స్పష్టం చేశారు.

### ప్రజలు నవ్వుకుంటున్నారు

చనిపోయిన తల్లిపై ప్రమాణం చేయడానికి పేర్ని నాని సిగ్గుపడాలి. గతంలో పెద్దపట్నం పోర్టు గురించి తల్లిపై ఒట్టేశావ్. బందరు పోర్టు కట్టక పోతే రాజకీయాలు వదిలేస్తానని కోనేరు సెంటర్లో ముక్కు నేలకు రాశావ్. ఆ మాటలన్నీ తప్పిన పేర్ని ఈ రోజు తల్లిపై ప్రమాణం చేయడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మా నాయకుడు చంద్రబాబు దేవుడని నువ్వు చెప్పడం కాదు.. ఆయన గురించి తెలిసిన ఏ ఒక్కరైనా అదే మాట చెబుతారు. కానీ ఆయన పేరు వాడుకుని జరగని విషయాలను జరిగినట్లు మభ్యపెట్టాలనుకోవడం సిగ్గుచేటు. దొంగతనం చేశావు. దొరికిపోయావు. ఇంకా నాటకాలెందుకని మంత్రి కొల్లు ప్రశ్నించారు.

# పేర్ని.. చేసిన తప్పు ఒప్పుకో

- నీ భార్యను నువ్వే కేసులో ఇరికించావు
- టీడీపీ నేత బుద్దా వెంకన్న ఫైర్



విజయవాడ (చైతన్యరథం): మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని చేసిన తప్పు ఒప్పుకుని పోలీసులకు లొంగిపోయి, ఆయన భార్యను బియ్యం మాయం కేసు నుంచి తప్పించాలని టీడీపీ సీనియర్ నేత బుద్దా వెంకన్న హితవు పలికారు. మహిళలపై కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారంటూ పేర్ని నాని చేసిన వ్యాఖ్యలకు బుద్దా వెంకన్న స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. విజయవాడలో ఆదివారం మీడియాతో బుద్దా వెంకన్న మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా భువనేశ్వరి గురించి వైసీపీ నేతలు అసభ్యంగా మాట్లాడితే నోరు మొదపని పేర్ని ఇప్పుడు చిలక పలుకులు పలుకుతున్నాడని దుయ్యబట్టారు. అసెంబ్లీలో వైసీపీ నేతలు అలా అనడం సరికాదని ఇప్పటికైనా పేర్ని నాని చెంపలు ఎందుకు వేసుకోవడం లేదని నిలదీశారు. వైసీపీ నేతలు కొడాలి నాని, వల్లభనేని వంశీపై తాను విమర్శలు చేస్తే.. పేర్నికి ఎందుకు అంత పౌరుషం వచ్చిందని బుద్దా వెంకన్న నిలదీశారు. ఆ రోజు నా మీద కేసులు పెట్టి.. నన్ను ఇబ్బందులు పెట్టాలని పేర్ని నాని చూశాడు. నా దేవుడు చంద్రబాబు ఇంట్లో వాళ్లను తిట్టారు కాబట్టే నేను కూడా కౌంటర్ ఇచ్చాను. అసభ్యంగా మాట్లాడినందుకు నన్ను అరెస్టు చేయాలని ఫిర్యాదు చేస్తావా. మరి ఇప్పుడు నీ భార్య జయసుధ గురించి మేము ఒక్క మాట అయినా మాట్లాడామా? ఆమెను అరెస్ట్ చేసేందుకు సీఎం చంద్రబాబు అంగీకరిచలేదని నువ్వే కదా చెప్పావు. ఎవరినీ కించపరిచే ఉద్దేశ్యం చంద్రబాబుకి ఉండదు అది ఆయన ఉన్నత మనస్తత్వం అని బుద్దా వివరించారు.

### భార్యను కేసులో ఇరికించి..

గతంలో పేర్ని సినిమాటోగ్రఫీ మంత్రిగా ఉన్నప్పుడు వివాదస్పద దర్శకుడు రాంగోపాల్ వర్మ.. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లపై అసభ్యకరమైన సినిమా తీయడానికి చర్చ జరిపింది వాస్తవమా కాదా. అక్రమంగా సంపాదించిన డబ్బులు రాంగో పాల్ వర్మకు ఇచ్చి.. సినిమా తీయడానికి ప్రోత్సహించింది నువ్వు కాదా. ఈ రోజు నీ భార్య జయసుధ దోషిగా నిలబడటానికి కారణం నువ్వు కాదా. గోడౌన్లు ఆమె పేరుతో పెట్టి.. అందులో ఉన్న బియ్యం నువ్వు అమ్ముకున్నావు. అంటే నీ భార్యను నువ్వే కేసులో ఇరికించుకుని.. రాజకీయ కుట్ర అంటావేంటి.

### చేసిన తప్పు ఒప్పుకో..

బూతులు తిట్టే కొడాలి నాని, వల్లభనేని వంశీలతో అంటకాగినప్పుడు ఇంట్లో ఆడవాళ్లను విమర్శించకూడదని నీకు తెలియదా. చంద్రబాబు తన సతీమణి పేరుతో కంపెనీలు పెట్టుకుని నడిపారు. నీలాగా ప్రజల బియ్యాన్ని అమ్ముకుని.. భార్యను జైలుకు పంపాలని అనుకోలేదు. నా భార్య ఆత్మహత్య చేసుకునేలా ఉందని అంటున్నావు. అందుకు నువ్వు కారణం కాదా. 7500 బస్తాల బియ్యం గోడౌన్‌లో మాయం అయితే... నువ్వే కదా నీ భార్య పేరు గోడౌన్‌కు పెట్టుకున్నావు. నిన్ను ఎందుకు అరెస్టు చేయకూడదు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని నువ్వే కదా గతంలో గొప్పగా చెప్పావు. పేర్ని నాని ఇప్పటికైనా చేసిన తప్పులకు చెంపలు వేసుకుని క్షమాపణ కోరు. 7500 బస్తాలు నేనే దొంగతనం చేశానని పోలీసులకు లొంగిపోయి.. నీ భార్యను కేసు నుంచి తప్పించు అని బుద్దావెంకన్న హితవు పలికారు.

# అప్పుడు ఇంట్లో ఆడవాళ్లు గుర్తు రాలేదా?

- పేర్ని నానికి జేసీ కౌంటర్



అనంతపురం: వైసీపీ నేత మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యలపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులతో కూటమి ప్రభుత్వం తమను వేధిస్తోందన్న పేర్ని ఆరోపణలను ఆయన ఖండించారు. నాని మంత్రిగా ఉన్నప్పుడు ఇంట్లో ఆడవాళు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. చంద్రబాబును అరెస్టు చేసిన సమయంలో, పవన్ కల్యాణ్ పెళ్లిళ్లపై విమర్శలు చేసినప్పుడు సభ్యత ఏమైందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దేవుడు కాబట్టి వైసీపీ నేతలు ఇవాళ బయటికి వస్తున్నారని.. వైసీపీ హయాంలో ఐదేళ్లు మమ్మలను బయటికి రానివ్వలేదని ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆ రోజు కొల్లు రవీంద్ర ధైర్యంగా జైలుకు వెళ్లారని.. పేర్ని నాని ఇవాళ దొంగ ఏడుపులు ఏడుస్తున్నాడని జేసీ ఎద్దేవా చేశారు. పేర్ని నాని లాంటి వాళ్లను వదిలిపెట్టవద్దని సీఎం చంద్రబాబుకు సూచించారు. పేర్ని నాని నిన్ను మాత్రం వదిలేది లేదు. ఇంకోసారి మీడియా ముందుకు వచ్చి మాట్లాడితే మర్యాద దక్కదని జేసీ హెచ్చరించారు.

# తమిళనాడును మొదట పాలించింది తెలుగువారే

- భాష ఔన్నత్యాన్ని భావితరాలకు తెలియజేయాలి
- ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో మండలి బుద్ధప్రసాద్

విజయవాడ (చైతన్యరథం): తెలుగు భాష, తెలుగు జాతి గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత కవులు, రచయితలపై ఉందని 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల గౌరవాధ్యక్షుడు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో రెండురోజుల పాటు నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ చెన్నైలో ఇటీవల ఓ సినీనటి మాట్లాడుతూ.. తమిళనాడుకు తెలుగువారు పరిచారకులు (సేవకులు)గా వచ్చారని చెప్పారు.. అది వాస్తవం కాదు.. తమిళనాడును మొదట పాలించింది తెలుగువారేనని స్పష్టం చేశారు. ఆ తర్వాతే తమిళులు పాలించారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి అత్యధిక సంఖ్యలో ముఖ్యమంత్రులుగా పనిచేసింది కూడా తెలుగువారే. శ్రీకృష్ణ దేవరాయలు, రాణి మంగమ్మ, నాయకరాజులు తెలుగులోనే పరిపాలన చేశారు. తమిళనాట తెలుగు ఓ వెలుగు వెలిగింది తప్ప.. దాస్య ప్రవృత్తితో తెలుగువారు అక్కడ లేరనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించేందుకు తమిళులెవరూ ముందుకు రాలేదు. సైమన్ కమిషన్ వస్తే తుపాకీ గుండుకు ఎదురుగా గుండె చూపిన వ్యక్తి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు. ఉప్పు సత్యాగ్రహానికి మహాత్మాగాంధీ పిలుపునిస్తే.. కాశీనాథుని నాగేశ్వరరావు, ప్రకాశం పంతులు, దుర్గాబాయమ్మ నాయకత్వం వహించారు. మద్రాసు నగరంలో ఏ కార్యక్రమాన్నయినా విజయవంతంగా నడిపించిన ఘనత తెలుగువారిది. మనలో భాషాభిమానం, జాతీయాభిమానం తగ్గింది. ఫలితంగా తమిళనాడులో ఉన్న తెలుగువారు.. తెలుగువారని నమోదు చేసుకోకపోవటంతో రెండో స్థానంలో ఉన్న తెలుగు భాష నాలుగో స్థానానికి పడిపోయింది. త్వరలో జరగబోయే జనగణనలో ఇతర రాష్ట్రాల్లో ఉన్న ప్రతి తెలుగు వ్యక్తి.. తెలుగువారుగా నమోదు చేసుకోవడం ద్వారా తెలుగు భాషను మళ్లీ రెండో స్థానానికి తీసుకెళ్లాలి. మహాసభలకు విచ్చేసిన కవులు, రచయితలు తెలుగు భాషను, తెలుగు జాతిని ముందుకు తీసుకెళ్లేందుకు యోధులుగా మారాలని బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు.



### తెలుగులో ప్రభుత్వ ఆదేశాలు: మంత్రి సత్యకుమార్

అధికారుల కోసం కూడా తెలుగు భాషపై సదస్సు నిర్వహించాలని మంత్రి సత్యకుమార్ సూచించారు. ప్రభుత్వ శాఖల్లో ఆదేశాలు తెలుగులో వచ్చేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు భాష ఔన్నత్యం గురించి అందరూ తెలుసుకోవాలన్నారు విజయవాడలో జరుగుతున్న 6వ ప్రపంచ తెలుగు మహా సభల్లో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ... గొప్ప వారి ముందు కూర్చున్నప్పుడు తనలో ఆత్మనూన్యతాభావన వస్తుందని.. వారి ద్వారా తాను ఎన్నో విషయాలు తెలుసుకుని.. ఆచరిస్తానని చెప్పారు. ఆంగ్లం మాట్లాడితే తాము చాలా గొప్ప అనే భావన చాలా మందిలో ఉందని.. కానీ దేశ భాషలందు తెలుగు లెస్స అన్న రాజులెందరో ఉన్నారని గుర్తుచేశారు. నన్నయ్య, తిక్కన్న, ఎర్రన్న పేర్లను ప్రస్తావించకుండా తెలుగు భాష గురించి మాట్లాడలేమని అన్నారు. ఆ తర్వాత అనేక మంది మహానుభావులు తెలుగు భాష పరిరక్షణకు పాటుపడ్డారని ఉద్ఘాటించారు. రాజకీయంగా నేతల మధ్య సైద్ధాంతిక విబేధాలు ఉన్నా.. భాష కోసం అందరూ కలిసి నడవాలని సూచించారు. తెలుగు భాష కోసం చేపట్టిన యజ్ఞంలో తాను కూడా భాగస్వామిగా నడుస్తానని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

# కరెంటు పాపం జగన్ రెడ్డిదే

- ◆ మాటలకు చేతలకు పొంతన లేని మాజీ సీఎం
- ◆ ఐదేళ్లలో పదిసార్లు చార్జీలు పెంచాడు
- ◆ విద్యుత్ వ్యవస్థలను ధ్వంసం చేశాడు
- ◆ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ధ్వజం



పాతపట్నం, (చైతన్యరథం): మాజీ సీఎం జగన్‌రెడ్డి మాటలకు చేతలకు పొంతన లేని రీతిలో ఐదేళ్ల పాలన పేరుతో కాలక్షేపం చేశాడని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలను మభ్యపెట్టి పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన జగన్ ఇపుడు చార్జీలు పెంచుతున్నారంటూ గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ పాలకులు చేసిన పాపాలను ఎదుటి వారికి ఆపాదించే నీచ రాజకీయానికి దిగుతున్నారన్నారు.

గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో చేసిన తప్పులు, పాపాలే విద్యుత్ చార్జీలు పెరగడానికి కారణమన్నారు. వైకాపా ప్రభుత్వం సమయంలో గత పాలకులు చేసిన పాపాలు ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాపాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు అలాగే 2019-24 మధ్య అవగానలేని పరిపాలన వల్ల రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందన్నారు. 2019లో తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయే సమయానికి మిగులు కరెంటుతో రాష్ట్రాన్ని జగన్మోహన్ రెడ్డికి అప్పగించామన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం జగన్ అధికారంలో ఉన్న సమయంలో ఇష్టారాజ్యాంగా విద్యుత్ కొనుగోలు చేసి ఆ భారాన్ని ప్రజలపై వేసేందుకు జగన్మోహన్ రెడ్డి ఈఆర్సీని కోరాడన్నారు. 2022-23, 2023-24 సంవత్సరాలకు గాను ప్రజలపై భారం మోపాలని జగన్ ప్రభుత్వం ఆ చార్జీలను ఆమోదం తెలిపి ఈఆర్సీకి పంపిందన్నారు. అంటే ఆ చార్జీలు రెండేళ్ల క్రిందటే జగన్ హయాంలోనే వేయాల్సి ఉందన్నారు. ఆ సందర్భంలో పెంచితే జగన్ ప్రభుత్వంపై 2024 ఎన్నికల్లో వ్యతిరేకత వస్తుందని 2024 మార్చికి వాయిదా వేశారన్నారు, ఇప్పుడు పెంచాల్సిన ట్రూ అప్ చార్జీలు జగన్ ప్రభుత్వంలో పెంచాల్సినవన్నారు. వారి హయాంలో పెంచాల్సిన చార్జిలపై, ఇప్పుడు జగన్, వారి బృందాలే నియోజకవర్గం కేంద్రాల్లో విద్యుత్ చార్జీలు పై ధర్నాలు, ఆందోళన నిరసనలు చేయటమనేది హాస్యాస్పదంగా ఉందనని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో పాలకొండ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ పడాల భూదేవితో పాటు ఐదు మండలాల అధ్యక్షులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఆసరాగా సీఎం సహాయనిధి

- ◆ ఎస్ కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి
- ◆ బాధితులకు చెక్కులు పంపిణీ



ఎస్‌కోట, (చైతన్యరథం): అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని ఎస్ కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. ఆదివారం లక్కవరపుకోటలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు రూ.18,81,201/- ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.

ఎల్.కోట మండలం ఎల్.కోట గ్రామానికి చెందిన పుట్టా పైడిరాజుకు 4,08,655/- రూపాయలు, ఎల్ కోట మండలం యండపల్లి సత్యవతికి 2,63,583/- రూపాయలు, ఎస్.కోట మండలం వెంకటరమణపేట గ్రామానికి చెందిన గేదల కృష్ణ కుమారుడికి 202621/- రూపాయలు, దారపురెడ్డి అప్పారావుకు 1,83,754/- రూపాయలు. కొత్తవలస మండలం వీరభద్రపురం గ్రామానికి చెందిన ఇతకర్లపల్లి కనకమహాలక్ష్మికి 1,41,616/- రూపాయలు, ఎల్ కోట మండలం గనివాడ గ్రామానికి చెందిన చొక్కాకుల మల్లునాయుడుకు రూ.1,20,283/- రూపాయలు, కొనిశెట్టి రాముకు 1,18,013/- రూపాయలు, బీత వెంకట శివ ప్రసాద్ గారికి 99,261/- రూపాయలు, కొత్తవలస మండలం నిమ్మలపాలెం గ్రామానికి చెందిన ఇందుగుబిల్లి లక్ష్మికి 74,291/- రూపాయలు, ఎస్.కోట మండలం కిల్తంపాలెం గ్రామానికి చెందిన కాంద్రేగుల మమదీప్‌కు 63,700/- రూపాయలు, భూమిరెడ్డి సత్యంకు 57,350/- రూపాయలు, ముచ్చకర్ల శ్రీనివాసరావుకు 55,524/- రూపాయలు, వేపాడ మండలం బల్లంకి గ్రామానికి చెందిన గొర్లె నాగరాజుకు 55,200/- రూపాయలు, వేపాడ మండలం అరిగిపాలెం గ్రామానికి చెందిన చింతల నాయుడుకు 37350/- రూపాయల చెక్కులను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలలో కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుందని అన్నారు. మెరుగైన వైద్యం కోసం వివిధ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందిన బాధితులకు వారు చెల్లించిన నగదు రసీదులతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే విచారించిన అనంతరం క్షతగాత్రులకు ముఖ్యమంత్రి సహాయ నిధిని కూటమి ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పరిరక్షించడంతోపాటు మెరుగైన సమాజాన్ని అందించాలనే ఆలోచన విధానంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని ఆయన సేవలు రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎస్ కోట శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాం ప్రసాద్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శ్రీనాథ్ పెదబాబు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, కొత్తవలస ఎల్ కోట, ఎస్ కోట మండల పార్టీ అధ్యక్షుడు గొర్లపల్లి రాము, చొక్కాకుల మల్లునాయుడు, జీఎస్ నాయుడు, మాజీ జడ్పిటీసీలు కోళ్ల శ్రీను, కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి, వేపాడ మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, ఇందుకూరి శ్రీనురాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి చెక్కు అందజేసిన కురుపాం ఎమ్మెలే జగదీశ్వరి

పార్వతీపురం(చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లా, కురుపాం నియోజకవర్గం, జియ్యమ్మవలస మండలం, అలమండ గ్రామ పంచాయితీ, అప్పన్నదొరవలస గ్రామంలో ఏలూరు మధుమతి బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న కారణంగా ప్రభుత్వ విప్ కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ. 2,76,279 రూపాయలను బాధిత కుటుంబానికి మంజూరు చేయించారు. మంజూరైన మొత్తం చెక్కు రూపంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి చేతుల మీదుగా మండల నాయకుల సమక్షంలో బాధిత కుటుంబానికి అందించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపీపీ బొంగు సురేష్, వట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ యం సత్యం నాయుడు, టీటీడీపీ కురుపాం నియోజకవర్గం వేలమ సాధికాం సమితి అధ్యక్షుడు రెడ్డి బలరామస్వామి నాయుడు, కురుపాం నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షుడు గురన శ్రీరామ్మూర్తి నాయుడు, కురుపాం నియోజకవర్గం తూర్పుకాపు సాధికార సమితి అధ్యక్షుడు లంక గోపాలం, వైస్ ఎంపీపీ బిడ్డిక నరేష్,టీడీపీ సీనియర్ నాయకులు పూడి సీతారాం, దాసరి రామారావు, గ్రామ సర్పంచ్ ఊయక మన్మధ, టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.












మత్తుతో జీవితాలు చిత్తు చేసుకోవద్దంటూ ఆదివారం శ్రీకాకుళంలో నిర్వహించిన 5కె వాక్‌లో పాల్గొన్న కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

# నిబంధనలు పాటించండి

- ◆ కొత్త ఏడాదిని ఘనంగా ఆహ్వానించండి
- ◆ విశాఖపట్టణం పోలీసుల పిలుపు

విశాఖపట్టణం, (చైతన్యరథం): ముందు జాగ్రత్త చర్యలుగా విధించిన నిబంధనల పరిధిలో కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలకాలని విశాఖపట్టణం పోలీసులు పిలుపునిచ్చారు. అమలు చేస్తున్న నిబంధనలను వివరిస్తూ సిటీపోలీసు కమిషనర్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేమన మందిరం నుండి ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై వాహనదారుల భద్రత దృష్ట్యా 31వ తేదీ రాత్రి 8 గంటల నుండి 1వ తేదీ ఉదయం 5 గంటల వరకు వాహనాల రాకపోకలను నిషేధించారు.

1వ తేదీన సంపత్ వినాయక గుడి వద్ద గోటీ సన్స్ నుండి కళామందిర్ వరకు రోడ్డుకి ఎడమ వైపున వాహన రాకపోకలకు ఆటంకము కలుగ కుండా ఒకే ఒక వరుసలో పార్కింగ్ చేసుకోవాలి. రోడ్డుకు కుడి వైపున జీవీఎంసీ కమిషనర్ బంగ్లా నుండి వేమన మందిరం వరకు ఒకే ఒక వరుసలో పార్కింగ్ చేసుకోవాలి, గుడి ముందు వాహన పూజలు అనుమతి నిలిపేశారు.

పార్క్ హెూటల్ నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు 31వ తేదీ రాత్రి 8 గంటల నుండి మరుసటి రోజు ఉదయం గంటల వరకు గంటల వరకు వాహనాల రాకపోకలకు, పార్కింగ్‌కు అనుమతి రద్దు చేశారు. బీఆర్‌టీఎస్ హనుమంతవాక నుండి అడవివరం జంక్షన్, గోశాల జంక్షన్ నుండి వేపగుంట జంక్షన్, పెందుర్తి జంక్షన్ నుండి ఎన్ఏడీ జంక్షన్ మీదుగా కాన్వెంట్ జంక్షన్ వరకు మధ్య లైను మూసివేస్తారు. అత్యవసర వాహనాలు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్డు గుండా అనుమతిస్తారు. వాహనదారుల భద్రత దృష్ట్యా రాత్రి 10 గంటల నుండి ఉదయం 05 గంటల వరకు మద్దిలపాలెం జంక్షన్ నుండి రామా టాకీస్ వరకు ఉన్న బీఆర్టీఎస్‌రోడ్ మధ్య లైను, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న అండర్ పాస్‌ను మూసేస్తారు.

**బీచ్‌కు వచ్చే సందర్శకులకు నిబంధనలు**

రెడ్డి జంక్షన్, ఆల్ ఇండియా రేడియో జంక్షన్ వైపు నుండి వచ్చే వాహనదారులు జాయింట్ కలెక్టర్ బంగ్లా ప్రక్కన ఉన్న పార్కింగ్ స్థలం లోను, ఏపీఐఐసీ గ్రౌండ్‌లోను తమ వాహనములను పార్క్ చేసుకోవాలి. కలెక్టర్ ఆఫీస్, కోస్టల్ బాటరీ, నౌరోజీ రోడ్, పందిమెట్ట వైపు నుండి వచ్చే వాహనదారులు గోకుల్‌పార్క్‌లో నిలుపుకోవాలి. సిరిపురం, పార్క్ హెూటల్ వైపు నుండి వచ్చు వాహనచోదకులు ఆంధ్ర యూనివర్సిటీ ఎగ్జిబిషన్ గ్రౌండ్, పోలీస్ ఆఫీసర్ మెస్ వెనుకవైపున పార్క్ చేసుకుని బీచ్ రోడ్డులోకి రావాలి. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే నిర్వాహకులు నిబంధనలు ప్రకారం సరైన సమయానికే కార్యక్రమాలు ముగించాలి. వాహనాలను సక్రమంగా పార్కింగుకు స్థలం కేటాయించి అదనపు సెక్యూరిటీ సిబ్బందిని వినియోగించాలి. ప్రతీ జంక్షన్ వద్ద పోలీస్ టీం ఉంటుంది. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. మద్యం త్రాగి వాహనములు నడిపే వారిపై, మితిమీరిన వేగంతో వాహనాలను నడిపే వారిపై ఆల్కో మీటర్లతో ప్రత్యేక డ్రైవ్‌తో తనిఖీ చేస్తారు.








# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం

- టీడీపీ తెలుగువారి గుండెల్లో సజీవంగా ఉంటుంది
- ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి స్పష్టీకరణ
- రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఆత్మీయ అభినందన సమావేశం

రాజమహేంద్రవరం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఆదివారం స్థానిక జెఎన్ రోడ్డులోని చెరుకూరి కళ్యాణ మండపంలో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం విస్తృత స్థాయి ఆత్మీయ-అభినందన సమావేశాన్ని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ తెలుగువారి గుండెల్లో సజీవంగా ఉంటుందని, ప్రజల ఆకాంక్షల నుంచి తెలుగుదేశం పార్టీ పుట్టిందని అన్నారు. ఆడబిడ్డలకు ఎన్టీఆర్ కల్పించిన ఆస్తి హక్కు దేశానికే దిక్సూచి అయ్యిందని తెలిపారు. టీడీపీకి కార్యకర్తలే బలం అని, వారందరి ఆశీస్సుల వల్లే ఇంతటి భారీ విజయాన్ని సాధించానని, ఎన్డీఏ కూటమి సభ్యుల సహకారం మరువలేనిదని వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో కార్యకర్తలందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అంటేనే అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా అని, ప్రజలు మెచ్చే విధంగా పాలన కొనసాగుతుందని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుని, రాష్ట్ర ప్రజలకు అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని కూడా అందిస్తామని తెలిపారు. విజయంలో కీలకపాత్ర పోషించిన సుమారు 700 మంది క్లస్టర్ ఇన్చార్జిలను, యూనిట్ ఇన్చార్జిలను, బూత్ ఇన్చార్జిలను, ముఖ్య నాయకులను సత్కరించి ప్రతి ఒక్కరికి మొక్కను బహుకరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, కడియం మండలం తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, జిల్లా ఉపాధ్యక్షులు మార్ని వాసుదేవ్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, గంగిన హనుమంతరావు, రాష్ట్ర రైతు నాయకులు మార్గాని సత్యనారాయణ, రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, నున్న కృష్ణ, కురుకూరి కిషోర్, అన్నందేవుల చంటి, బోడపాటి గోపి, చెల్లుబోయిన శ్రీనివాస్, దండమూడి ప్రసాద్, కామిని భాస్కర్ చౌదరి, పండూరి అప్పారావు, బొప్పన నాగేశ్వరరావు, తలారి మూర్తి, నిమ్మలపూడి రామకృష్ణ, ప్రత్తిపాటి రామారావు చౌదరి, శీలం గోవిందు, రొంపిచర్ల అంటోని, షేక్ సుభాన్, పితాని శివరామకృష్ణ, బిక్కిన సాంబశివరావు, గంగిన నాని, దారా అన్నవరం, నిమ్మలపూడి గోవిందు, పిల్ల తనుజ, గంగిన జాహ్నవి, కొయ్యను కుమారి, గోందేసి మాధవి లత, మన్యం నాగేంద్ర, వాసంశెట్టి నాగబాబు, గుత్తుల కృష్ణ, వరగోగుల వెంకటేశ్వరరావు, భీమరిశెట్టి రమేష్, ముమ్మిడి దేవీ నాగేశ్వరరావు, గుర్రపు సత్యనారాయణ, పాతూరి రాజేష్, మర్రెడ్డి రమేష్, ఉండవెల్లి బంగార్రాజు, దేవళ్ళ రాంబాబు, వట్టికూడి దత్తుడు, బొరుసు వెంకటేశ్వరరావు, అన్నందేవుల కోదండరాముడు, కొత్తపల్లి శ్రీరామ్, ఐ.టి.డి.పి సభ్యులు కోరాడ వెంకటేష్, ఎమ్మెస్సార్ శ్రీను, తాడేపల్లి నాగరాజు, రాయుడు సునీల్, చౌడాడ లాజర్, పడమట వరప్రసాద్, చిలుకూరి ప్రభాకర్, నిమ్మ లోకేష్, నమ్మి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.





# ఆపదలో ఉన్న గీత కార్మికులకు అండగా ఉంటాం

- శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి భరోసా
- ఆర్థిక సాయం అందజేసిన చైర్మన్ కుడుపూడి

తుని (చైతన్యరథం): ఆపదలో ఉన్న గీత కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గీత కార్మికుడు పెంకే వీరబాబుకి, ప్రమాదంలో మరణించిన గీత కార్మికుడు పెంకే పెద్ద శ్రీను కుటుంబాలను పరామర్శించి ఐదువేల రూపాయలు చొప్పున ఇరు కుటుంబాలకు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆర్థిక సహాయం అందజేశారు.

ఇటీవల తుని నియోజకవర్గం తొండంగి మండలంలోని కొమనాపల్లి గ్రామంలో కళ్ళు గీత కార్మికుడిగా జీవనం సాగిస్తున్న పెంకే వీరబాబు ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడిపోవడంతో రెండు కాళ్లు విరిగిపోయి చికిత్స అనంతరం నెల రోజుల నుండి ఇంటికి పరిమితమయ్యాడు. కదలడానికి సుమారు ఆరు నెలల వరకు చికిత్స కొనసాగించాలని వైద్యులు తెలపగా విషయం తెలుసుకున్న కుడుపూడి సత్తిబాబు పెంకే వీరబాబు ఇంటికి వెళ్లి పరామర్శించి 5 వేల రూపాయలను అందించారు. కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అలాగే పాయకరావుపేట నియోజకవర్గం రాయవరం మండలంలోని గీత కార్మికుడు పెంకే పెద్ద శ్రీను ఇటీవల గుండె నొప్పితో మరణించగా ఆ కుటుంబాన్ని కుడుపూడి సత్తిబాబు పరామర్శించి మనో ధైర్యం చెప్పారు. 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట గీత కార్మికుల అధ్యక్షులు పాండురంగారావు, పాలిక శ్రీను, వాసంశెట్టి అంజి, పంపన బుజ్జి, కట్టా అప్పలకొండ, పాలిక వెంకన్న, పోలవరపు శ్రీను, పోలవరపు సత్తిబాబు, మునసా సత్తిబాబు, దుంగా అప్పలరాజు, స్థానిక గీత కార్మికులు హాజరై సంతాపాన్ని తెలియజేశారు.

# తాడేపల్లిగూడెంలో టీడీపీ కార్యాలయం ప్రారంభం

తాడేపల్లిగూడెం (చైతన్యరథం): తాడేపల్లిగూడెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) ఆధ్వర్యంలో వారి ఇంటి వద్ద నిర్మించిన నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఏపీఐఐసీ చైర్మన్, పశ్చిమగోదావరి టీడీపీ అధ్యక్షులు మంతెన రామరాజు, ఏలూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ, ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్, తణుకు శాసన సభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ, గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు, రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారు ఎం.డి షరీఫ్, నర్సాపురం టీడీపీ ఇంచార్జి పొత్తూరి రామరాజు, తాడేపల్లిగూడెం బీజేపీ ఇంచార్జి ఈతకోట తాతాజీ, ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే ఆరిమిల్లికి కృతజ్ఞతలు

తణుకు (చైతన్యరథం): ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఔదార్యంతో చిన్నారికి ఉచితంగా వైద్యం చేయించారు. తణుకు మండలం మండపాక గ్రామానికి చెందిన చీలి సురేష్ అనూష దంపతుల 15 నెలల కుమార్తెకు గుండె సమస్య ఉందని స్థానిక ఎమ్మెల్యే దగ్గరికి వచ్చి సమస్యను విన్నవించుకుంటే త్వరితగతిన హైదరాబాద్ స్టార్ హాస్పటల్ వైద్యులతో మాట్లాడి ఆపరేషన్ చేయించారు. 10 లక్షల రూపాయలు వైద్యాన్ని ఉచితంగా చేయించిన తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు బాలిక తల్లిదండ్రులు వచ్చి కృతజ్ఞతలు తెలిపారు.











# గుణదల మేరీమాత ఉత్సవాలకు ప్రభుత్వ సహకారం

**◆విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ స్పష్టీకరణ**

**◆ ఏర్పాట్లపై చర్చి కౌన్సిల్ సభ్యులతో సమావేశం**

**◆ఉత్సవాలకు విజయవాడ బ్రాండ్ అంబాసిడర్**

విజయవాడ (చైతన్యరథం): ప్రముఖ గుణదల మేరీమాత ఉత్సవాలకు ప్రభుత్వ సహకారం ఉంటుందని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. ఉత్సవాలకు విజయవాడ బ్రాండ్ అంబాసిడర్ అని.. విజయవాడ వైభవాన్ని దసరా నవరాత్రి ఉత్సవాలు, గుణదల మేరీ మాత ఉత్సవాలు చాటి చెబుతాయని అన్నారు. గుణదల మేరీమాత ఉత్సవ ఏర్పాట్లకు సంబంధించి ప్రభుత్వం తరపున కావలసిన సహాయ సహకారాలు తెలుసుకునేందుకు ఎంపి కేశినేని శివనాథ్ ఆదివారం గుణదల చర్చ్ కౌన్సిల్ సభ్యులతో సమావేశం అయ్యారు. ఎంపి కేశినేని శివనాథ్‌కు ఫాదర్ విలియం జయరాజ్ ఏలేటితో పాటు కౌన్సిల్ సభ్యులు స్వాగతం పలికారు. ముందుగా ఫాదర్ విలియం జయరాజ్ ఏలేటి ఆధ్వర్యంలో ఎంపి కేశినేని శివనాథ్ మేరీమాత విగ్రహాం ముందు ప్రార్ధన చేశారు.

సమావేశం అనంతరం ఎంపి కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఏడాది ఎంతో ప్రతిష్టాత్మకంగా మేరీమాత ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా మేరీమాత ఆశీస్సుల కోసం అధిక సంఖ్యలో విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అన్ని సదుపాయాలు కల్పించే విధంగా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఫాదర్ విలియం జయరాజ్ ఏలేటి, కౌన్సిల్ సభ్యులతో ఉత్సవ ఏర్పాట్లపై చర్చించటం జరిగిందన్నారు. చిన్న చిన్న సమస్యలు పరిష్కరించాల్సిందిగా కౌన్సిల్ సభ్యులు కోరారని, వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఉత్సవాలంటేనే విజయవాడ కాబట్టి దేశంలోని భక్తులందరూ మేరీ మాత ఆలయానికి విచ్చేసి ఆశీస్సులు తీసుకునే విధంగా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ఫాదర్‌ను కోరటం జరిగిందన్నారు. అభివృద్ధి విషయంలో ప్రభుత్వం తరుపున సహాయం కావాలంటే ఆ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళతామని చెప్పినట్లు పేర్కొన్నారు. టూరిజం క్యాపిటల్‌లో రీజనల్ టూరిజం రిలీజియస్ట్ టూరిజం ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. రిలీజియస్ట్ టూరిజంలో మేరీమాత ఆలయం ఎక్కువ ప్రాధాన్యత సంతరించుకుందన్నారు.

అనంతరం ఫాదర్ విలియం జయరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం తరపున ఉత్సవాలకు సహాయ సహకారాలు అందించేందుకు ఎంపి కేశినేని శివనాథ్ విచ్చేసి మాట్లాడటం సంతోషంగా వుందన్నారు. గత వందేళ్ల నుంచి జరుగుతున్న ఈ ఉత్సవాలకు అన్ని ప్రభుత్వ శాఖల వారు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఎంపి కేశినేని శివనాథ్ చెప్పిన కొన్ని అంశాలపై పీఠాధిపతులతో చర్చించి సమాచారం తెలియజేస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో గుణదల చర్చి ప్రెసిడెంట్ నువ్వుల విజయబాబు, వైస్ ప్రెసిడెంట్ చెరుకూరి జోసెప్ బాట్టిస్తా, కోశాధికారి గోలి విజయానంద్ జోసెప్, సభ్యులు జి.రవి కుమార్, జి.ఎస్.పరంపోగు చైతన్య, పిల్లి చిరస్తు దాసు, సేవ అబ్రహం, దాసరి సిల్వ ప్రసాద్, బండి జయరాజు, జి. బాల బాబుజీ, సి.అరుణ కుమారి, జి.యేసు దీవెనమ్మ , టీడీపీ నాయకులు పాల్గొన్నారు.





# క్రీడల్లోనూ రాణించేందుకు కృషి చేయాలి

**◆విద్యార్థులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఉద్బోధ**

గుంటూరు (చైతన్యరథం): చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించేందుకు విద్యార్థులు కృషి చేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు 29వ డివిజన్ ఏటి అగ్రహారం సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎమ్మెల్యే అభినందించారు. పోటీలు ముగిసిన అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... విద్యారంగంతో పాటు క్రీడారంగాన్ని కూడా విస్తృతంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని తెలిపారు. పవర్ లిఫ్టింగ్ పోటీలకు గుంటూరుని ప్రధాన కేంద్రంగా తయారు చేస్తామని గళ్ళా మాధవి తెలిపారు. అదే విధంగా క్రీడాకారులకు తగిన సౌకర్యాలు కల్పించడంతోపాటు అసోసియేషన్‌కు అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

క్రీడల్లో రాణించడం ద్వారా యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా అవకాశం దక్కుతుందని ఎమ్మెల్యే మాధవి తెలిపారు. అన్ని క్రీడల్లో యువత రాణించి ఆంధ్రప్రదేశ్‌కి, భారతదేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని క్రీడాకారులకు ఎమ్మెల్యే సూచించారు.



# విద్యుత్ చార్జీల పాపం ముమ్మాటికీ జగన్‌దే

**◆ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ధ్వజం**

జగ్గయ్యపేట (చైతన్యరథం): జగన్ అసమర్థత, అవినీతి వల్లే విద్యుత్ ఛార్జీలు పెరిగాయని, ఆయన డ్రామాలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ధ్వజమెత్తారు. ఆదివారం ఎమ్మెల్యే తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల పెంపు భారం పూర్తిగా ముమ్మాటికి గత ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న తప్పుడు నిర్ణయాల ఫలితమేనని అన్నారు. తన పార్టీ ఉనికి కోసం జగన్ సరికొత్త డ్రామాలు ఆడుతున్నారన్నారు. రూ.17 వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారం పెంచిందే జగనేనని మండిపడ్డారు. ఆనాడు జగన్ మోహన్‌రెడ్డి చేసిన అనాలోచిత ఒప్పందాల ఫలితంగానే నేడు కరెంటు ఛార్జీలు పెరిగాయన్నారు. ఎన్నికల తరవాత విద్యుత్ ఛార్జీల పెంచాలని ఈఆర్సీకి చెప్పింది ఆనాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కాదా..? అని ప్రశ్నించారు.

జగన్ పాప ఫలితమే ప్రజలపై రూ.17 వేల కోట్లకు పైగా విద్యుత్ ఛార్జీల పెంపు భారం పడిందన్నారు. కళ్ళు మూసుకుని పిల్లి పాలు తాగినట్లు... ఇపుడు కరెంట్ ఛార్జీలు పెంచారంటూ వైసిపి వారు ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రంగాపురం రాఘవేంద్రరావు,మేక వెంకటేశ్వర్లు, మైనేని రాధాకృష్ణ, ఇర్రి నరసింహారావు, గొట్టే నాగరాజు, గింజుపల్లి వెంకట్రావు, ఏలూరి గోపాలరావు, వేదులాపురి సైదా, మారేపల్లి శౌరి, పెద్దబ్బాయి, చావా నాగేశ్వరరావు, సయ్యద్ అస్లాం, గింజుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ భగళాముఖి అమ్మవారి ఆలయంలో**

# సుప్రీంకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎన్.వి.రమణ ప్రత్యేక పూజలు

బాపట్ల (చైతన్యరథం): బాపట్ల నియోజకవర్గం పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ బగళాముఖీ అమ్మవారి దేవాలయంలో సుప్రీంకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎన్.వి.రమణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్రాంత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ సతీ సమేతంగా ఆదివారం ఆలయానికి విచ్చేయగా వారికి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి వారితో కలిసి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిట్టవానిపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అఫ్జల్, గ్రామ పార్టీ అధ్యక్షులు రజాక్, చందోలు జనసేన మండల పార్టీ అధ్యక్షులు దాదా, నియాజీ తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు , కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలు పాల్గొన్నారు.



# జగన్‌రెడ్డీ.. విద్యుత్ చార్జీల బాదుడు నీ పాలనలోనే

**◆టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్ విమర్శ**

విజయవాడ (చైతన్యరథం): విద్యుత్ చార్జీల పెంపు భారం మీ పాలనలోనే అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్ విమర్శించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలు రాజకీయంగా మిమ్మల్ని కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేకుండా బాదినా మీకు బుద్ధి రాలేదన్నారు. మీ వైసీపీ ప్రభుత్వంలో తొమ్మిదిసార్లు కరెంటు చార్జీలు పెంచి, ప్రజల నుంచి ఐదేళ్లలో 32 వేల కోట్లు ముక్కు పిండి వసూలు చేసి, పదవ సారి కూడా పెంచడానికి అనుమతులు తెచ్చుకున్న ప్రభుత్వంలో నువ్వు కూడా మంత్రిగా ఉండి ఏ మొఖం పెట్టుకొని నేడు ధర్నాలు చేస్తున్నావ్ వెల్లంపల్లి అని నిలదీశారు. రెండు నియోజకవర్గాలలోను నిన్ను తిరస్కరించినా ఏ అర్హత పెట్టుకొని ధర్నాలు చేద్దామనుకుంటున్నావ్ అని మండిపడ్డారు.

# ఇటు బటన్ నొక్కడం.. అటు బండలు వేయడం

◆ వైసీపీ హయాంలో జరిగిందిదే
◆ విద్యుత్ చార్జీలపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదు
◆ మొహం చెల్లని వైసీపీ శ్రేణులు
◆ జనంలోకి వెళ్లలేక అవస్థలు



సూళ్లూరుపేట, (చైతన్యరథం): జిత్తుల మారి జగన్ సీఎంగా పదవి చేపట్టిన మరుక్షణం నుంచీ ద్వంద్వ వైఖరితోనే వ్యవహరిస్తున్నారని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే నెలవెల విజయశ్రీ ధ్వజమెత్తారు. బటన్ నొక్కి అమాయక జనాల దృష్టి తనవైపు తిప్పుకుని వెనుక నుంచి విద్యుత్ చార్జీల మోత మోగించాడని ఆరోపించారు. మిగులు విద్యుత్‌తో అధికారం చేపట్టి చేతగాక రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేశాడన్నారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద విద్యుత్ ధరల పెంపుదలపై వైసీపీ నాయకులు నిర్వహించిన ధర్నాపై ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మీడియాతో మాట్లాడారు. 2014 సంవత్సరంలో రాష్ట్రం ఏర్పాటయ్యాక 22.5మిలియన్ యూనిట్ల లోటుతో ప్రారంభమయ్యి 2019 నాటికి మిగులు విద్యుత్తును సాధించిన నేపథ్యంలో అధికారం చేపట్టిన జగన్ రెడ్డి 2019 నుంచి 2024 మధ్య కాలంలో పది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై 32 వేల కోట్లు భారం మోపాడన్నారు. విద్యుత్ కొరతను సృష్టించి బహిరంగ మార్కెట్లలోఅధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు చేసి 2700 కోట్లు నష్టం వచ్చేలా చేశాడన్నారు, సకాలంలో పోలవరం జలవిద్యుత్ కేంద్రం పూర్తి చేయకపోవడం వల్ల 4737 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. సెకి ఒప్పందం వల్ల సంవత్సరానికి 3850 కోట్లు చొప్పున 30 సంవత్సరాలకు ప్రజలపై భారం మోపారన్నారు. దీని కారణంగానే జగన్మోహన్ రెడ్డిపై కేసు నమోదు అయ్యిందన్నారు. 2014లో నారా చంద్రబాబునాయుడు విద్యుత్ ఉత్పత్తిని పెంచి యూనిట్లకు ఉచితంగా అందించారన్నారు. 2019 నుండి జగన్ రెడ్డి 9 గంటలు విద్యుత్ అని చెప్పి రైతులను 17 గంటలు అంధకారంలో మగ్గబెట్టాడన్నారు. ఈ పరిస్థితుల్లో బాధ్యతలు తీసుకున్న సీఎం చంద్రబాబు విద్యుత్ రంగాన్ని మళ్లీ పుంజుకునేలా చేస్తున్నారని తెలిపారు. వాస్తవాలు తెలిసిన ప్రజలే మోసకారి జగన్‌కు తగిన శాస్తి చేస్తారన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, సూళ్లూరుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, పెళ్లకూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, సూళ్లూరుపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొక్కు శంకరయ్య, బొమ్మన పళని, సెల్వం, కిషోర్, పచ్చ మాధవ నాయుడు, అలవల శ్రీనివాసులు, శ్రీనివాసన్, ప్రసాద్ నాయుడు, రాజేంద్ర ప్రసాద్, రామ్మూర్తి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ఫ్లైఓవర్ నిర్మిస్తాం... దిక్కులను కలిపేస్తాం!

◆ నుడా చైర్మన్ కోటంరెడ్డి
◆ ఆర్యవైశ్యులకు అన్నివేళలా అండగా ఉంటా
◆ వారంతా నా కుటుంబ సభ్యుల్లాంటి వారు
◆ ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో కోటంరెడ్డి వ్యాఖ్యలు
◆ వ్యాపారులంతా స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునేలా కృషి
◆ వైసీపీ హయాంలో బెదిరించి ఇబ్బంది పెట్టారు




నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు నగరంలోని తూర్పు పడమర ప్రాంతాలను కలిపేలా రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. స్టోన్‌హౌస్ పేటలోని పాండురంగ అన్నదాన సమాజంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి దంపతులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా కోటంరెడ్డి సంధ్య, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని ఆర్యవైశ్యులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆర్యవైశ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన అన్నారు.. తన రాజకీయ ప్రస్థానంలో ఆర్యవైశ్యుల సహకారం మరువలేనిదని స్పష్టం చేశారు. స్టోన్‌హౌస్ పేటను పొట్టి శ్రీరాములు నగర్‌గా మార్చాలని మొదట్లో తానే ప్రతిపాదన తీసుకొచ్చానని, దానికి కట్టుబడి ఉన్నట్లు ఆయన ప్రకటించారు. రెండోసారి నుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. నెల్లూరులో తూర్పు పడమర ప్రాంతాలను కలిపేలా రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ముడా తరుపున కృషి చేస్తానన్నారు. మంత్రి నారాయణ సహకారంతో అవసరమైతే ముఖ్యమంత్రిని కూడా కలుస్తానన్నారు. గతంలో తాను నుడా చైర్మన్‌గా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వ సహకారం చాలా తక్కువగా ఉన్నదన్నారు. అందుకే రైల్వే బ్రిడ్జి ఆలోచనను విరమించుకున్నామన్నారు. ఈసారి కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి తూర్పు ప్రాంత ప్రజల కష్టాల్ని తీర్చేందుకు రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణానిక గట్టి కృషి చేస్తానన్నారు. రూరల్ పరిధిలో ఎన్టీఆర్ పార్క్, ఎన్టీఆర్ నక్లెస్ రోడ్డు నిర్మాణానికి గతంలో తన వంతు సహకారం ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అధికారుల చేత దాడులు చేయించి వ్యాపారులను బెదిరించారన్నారు. వ్యాపారులంతా స్వేచ్ఛగా తమ వ్యాపారాలు చేసుకునే వాతావరణాన్ని కల్పిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు భోగనాథం కిషోర్, పెసల నరసింహస్వామి, భవనాసి సురేష్ బాబు, షణ్ముఖరావు, కోట గురుబ్రహ్మం, శ్రీరామ్ సురేష్, కొండా ప్రవీణ్ శేఖర్, మెంటా బ్రహ్మగుప్త, దాస లక్ష్మీనారాయణ ఆర్కేటీ శేషయ్య తదితరులు పాల్గొన్నారు..




# ఇది మన ప్రభుత్వం

◆ ఎమ్మెల్యే కందుల స్పష్టీకరణ

మార్కాపురం (చైతన్యరథం): ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మార్కాపురం పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన మార్కాపురం పట్టణ, మండల, తర్లుపాడు మండలాల యుటిఎఫ్ స్వర్ణోత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేశారని చివరకు జీతభత్యాలు కూడా ఒకటో తేదీ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారని గుర్తు చేశారు. చివరికి వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ ఖజానా ఖాళీ చేసి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. కనీస అభివృద్ధి పనులకు కూడా నిధులు లేకుండా చేశారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తమ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి విదేశాల నుండి పెట్టుబడులు ఆకర్షిస్తున్నారన్నారు. త్వరలోనే సత్ఫలితాలు సాధిస్తామని శాభావం వ్యక్తం చేశారు.

ముఖ్యంగా యుటీఎఫ్ గొడుగు కిందే దాదాపు మెజారిటీ ఉపాధ్యాయ సంఘాలు చేరాయన్నారు. ముఖ్యంగా యుటీఎఫ్ మీద ఉపాధ్యాయుల్లో ఉన్న నమ్మకానికి ఇది ప్రతిక అని అన్నారు. వెనుకబడిన ఈ ప్రాంతం నుండి ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్ 1 గ్రూప్ 2 ఉద్యోగాలకు తక్కువ మంది ఎంపిక అవుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో ముఖ్యంగా మార్కాపురం పట్టణంలో ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన లైబ్రరీ అందుబాటులో లేదన్నారు. ఈ మధ్య ఉపాధ్యాయ సంఘాలు కలిసినప్పుడు ఒక పెద్ద లైబ్రరీ అవసరం ఈ ప్రాంతానికి ఎంతో ఉందని చర్చించామన్నారు. త్వరలోనే దాన్ని కార్యాచరణ దిశగా తీసుకువెళతానన్నారు. యుటీఎఫ్ అడుగుతున్న డిమాండ్లు న్యాయబద్ధమైనవని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. త్వరలోనే కొంతమంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ప్రోత్సాహకాలను తన సొంత నిధులతో ఇస్తానని అన్నారు. ఈ సందర్భంగా యుటీఎఫ్ నాయకులు ఎమ్మెల్యేను సత్కరించారు. యుటీఎఫ్ నాయకులకు ఎమ్మెల్యే మెమెంటోలు అందజేశారు.

# నేనొక్కసారి రాయేస్తే పని పూర్తయినట్టే!

◆ అభివృద్ధే అజెండా, ఎన్నికల వరకే రాజకీయాలు
◆ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి
◆ రోడ్డు పనులకు శంకుస్థాపన

నెల్లూరు, (చైతన్యరథం): రూరల్ నియోజకవర్గ పరిధిలోని 26వ డివిజన్, డ్రైవర్స్ కాలనీ బిట్ 2 లో సుమారు 40 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన రోడ్డు పనులకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకుస్థాపన చేసిన రోడ్డు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతవాసుల చిరకాల కోరిక నెరవేరుతుందన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలన్నారు. ఎన్నికల తరువాత రాజకీయ జెండాలు లేకుండా అభివృద్ధే అజెండాగా పనిచేయాలన్నారు. ఎన్నికల వేళ మాత్రమే వచ్చే రాజకీయ నాయకులు చాలామంది ఉంటారన్నారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల మధ్య ఉండడం తనకు ఇష్టమన్నారు. ప్రజలకు ఎక్కడ ఏ చిన్న సమస్య వచ్చినా ఒక్క ఫోన్ కాల్ లేదా మెసేజ్ చేస్తే చాలన్నారు. స్పందించేదానికి తాను గాని తన తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కానీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. గత ప్రభుత్వంలో టెంకాయలు కొట్టడమేగాని పనులు ప్రారంభించింది లేదన్నారు. తాను టెంకాయ కొట్టడం జరిగితే పని పూర్తికావలసిందేనన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ బూడిద సుప్రజ ఉన్నారు, గత ఆరు నెలల్లో ఈ 26వ డివిజన్ లో 1 కోటి 25 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో అభివద్ధి పనులకు నిధులు కావాలని అడిగినా స్పందించే నాథుడే లేడన్నారు, తన సిద్ధాంతం ప్రకారం ఎన్నికల వరకే రాజకీయాలన్నారు, ఎన్నికలు తరువాత రాజకీయ జెండాలు లేకుండా అభివృద్దే అజెండాగా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జి ఊరందూరు సురేంద్ర బాబు, టీడీపీ నాయకులు బూడిద పురుషోత్తం యాదవ్, శివచారి, జహీర్, నరసింహ ముదిరాజు, వెంకన్న, ఎల్.పి. కృష్ణారెడ్డి, గౌస్, మాధవి, జావిద్, రామ్మూర్తి, కార్తీక్, బంటి, నౌషాద్, రఘు, నస్రు, బాబు, రఫీ, శంకర్, కృష్ణారెడ్డి, రాజేష్, ఏజాస్, కాలేషా, సర్దార్, చాన్ భాష, రఫీ, సరిత, నజీర్, నాగూర్, లోహిత్, షమీర్, షాహుల్, సల్మాన్, జనసేన నాయకులు సూచిత్, తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ టీచర్‌ను సత్కరించిన ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు (చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో యాదవ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమాల శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి చేతుల మీదుగా యాదవ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు పొందిన మొర్రి పిచ్చయ్యను ఎమ్మెల్యే శాలువాతో సత్కారం చేసి అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, ఓబిలిబోయిన వెంకటయ్య, బూనబోయిన చంద్రశేఖర్, బోనేని వెంకటేశ్వర్లు, దేమా శ్రీరాములు, యాదవ్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యుడు చల్లా రవికాంత్, పసుపుల చక్రపాణి, కొత్తకోట పోలయ్య తదితరులు పాల్గొన్నారు.









# అభివృద్ధి పనులు పరిశీలించిన మంత్రి సవిత

పెనుకొండ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ఆదివారం పరిశీలించారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం పరిగి మండలం కేంద్రం నుండి ఊటుకురు వెళ్లే రహదారిలో జరుగుతున్న పనులను పరిశీలించారు.

అనంతరం ఫైడేటి గ్రామంలో 3.5 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న సబ్ స్టేషన్ నిర్మాణ పనుల్ని పరిశీలించి త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో పరిగి మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం పరిగి మండలం మోద పంచాయతీ గోరవణహల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు.

తదుపరి మోదా పంచాయతీ పుట్టగూర్లపల్లి గ్రామంలో అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

**కనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి సవిత**

సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం పరిగి మండలం హొన్నంపల్లి గ్రామ కురుబ కులస్తుల కోరిక మేరకు తన తండ్రి, మాజీ



మంత్రి యస్ రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం విగ్రహాన్ని మంత్రి సవిత విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా ఆదివారం శ్రీ భక్త కనకదాసు విగ్రహన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హిందూపురం పార్లమెంట్ సభ్యులు పార్థసారథి, పెద్ద ఎత్తున కురుబ కులస్తులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



**నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ**

సత్యసాయి జిల్లా పెనుకొండ క్యాంప్ కార్యాలయంలో కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం వారి నూతన సంవత్సర క్యాలెండర్ రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కురుబ ఉపాధ్యాయ సంక్షేమ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై మంత్రి పయ్యావుల సమీక్ష



అనంతపురం (చైతన్యరథం): నగరంలోని రామ్‌నగర్ లో ఉన్న మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం పంచాయతీరాజ్ అధికారులతో మంత్రి పయ్యావుల కేశవ్ పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు.

ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోని పంచాయతీరాజ్ శాఖ పరిధిలో చేపడుతున్న పనులపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో రహదారులు, సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. జనవరి నెలాఖరులోపు చేపట్టిన సిసి రోడ్లు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని, కోరారు. అధికారులు బాధ్యతగా పని చేయాలనీ పంచాయత్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, ఈఈ ప్రభాకర్ రెడ్డి, డిఈ రసూల్, ఏఈలు రమణయ్య, రవీంద్ర పాల్గొన్నారు.



## సబ్సిడీపై పంట కోత యంత్రాల పంపిణీ

రాప్తాడు (చైతన్యరథం): అనంతపురం క్యాంప్ కార్యాలయంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటా సునీత ఆదివారం సబ్సిడీతో పంట కోత యంత్రాలను అందచేశారు. రాప్తాడు నియోజకవర్గం, కనగానపల్లి మండలం, తూముచర్ల గ్రామానికి చెందిన కురుబ మల్లే వసికేరప్పకు, చెన్నేకొత్తపల్లి మండలం, వెంకటాంపల్లి గ్రామానికి చెందిన కె.అశ్వర్థ రెడ్డి, ప్యాదిండి గ్రామానికి చెందిన చంద్రాచర్ల నరసింహులుకి సబ్సిడీతో పంట కోత యంత్రాలను అందించారు. యంత్రం విలువ 5లక్షల 70వేలు కాగా.. ప్రభుత్వం 2లక్షల రూపాయలు సబ్సిడీ ఇవ్వగా, మిగిలిన 3లక్షల 70వేల రూపాయలు రైతు చెల్లించారు.

## వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల



పులివెందుల (చైతన్యరథం): కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం వేముల మండలంలోని వేల్పుల గ్రామంలో పూజారి ప్రభాకర్ ఏర్పాటు చేసిన నూతన వాటర్ ప్లాంట్‌ను ఆదివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి, తుంగభద్ర హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, పేర్ల శేషా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బ్రహ్మయ్య రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ నాయకుడు రాగిపిండి సుధాకర్ రెడ్డి, రాగి పిండి హనుమంత్ రెడ్డి, పిండి శివకేశవరెడ్డి, లక్కీరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి, లక్కిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, లక్కిరెడ్డి వీరారెడ్డి, లక్కీరెడ్డి జయరామి రెడ్డి, వేల్పుల చెరువు చైర్మన్ రాగిపిండి శ్రీనివాసులు రెడ్డి, గ్రామంలోని ప్రజలు పాల్గొన్నారు.

## నేడు రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ కడప రాక

కడప (చైతన్యరథం): ఉమ్మడి కడప జిల్లా గాలివీడు మండలం ఎంపీడీఓ జవహర్ బాబుపై వైసీపీ నాయకులు దాడి సంఘటనను రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ తీవ్రంగా ఖండించిందని రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఉపాధ్యక్షులు కొత్తకు మునిరెడ్డి తెలిపారు. ఆదివారం పత్రిక విలేకరులతో మునిరెడ్డి మాట్లాడుతూ సంఘటన జరిగిన రోజు ఎంపీడీఓని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవీబీ రాజేంద్ర ప్రసాద్, రాష్ట్ర సర్పంచుల సంఘం ఫోన్ ద్వారా పరామర్శించారని



తెలిపారు. ఇందులో భాగంగానే సోమవారం ఉదయం 10 గంటలకు జవహర్ బాబుని పరామర్శించనున్నట్లు తెలిపారు. ఆయన కుటుంబానికి రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్, రాష్ట్ర సర్పంచుల సంఘం నాయకులు అండగా ఉండాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర సర్పంచుల సంఘం నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు.



**రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు మండలం, పి.సిద్ధరాంపురం గ్రామానికి చెందిన చెండ్రెడ్డి నరసింహులు కు 50వేల రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అనంతపురం క్యాంప్ కార్యాలయంలో అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత**

# తెలుగు సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లిన అక్కినేని

## ◆'మన్ కీ బాత్'లో మోదీ ప్రశంస

న్యూఢిల్లీ: ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్ కీ బాత్ కార్యక్రమం 117వ ఎపిసోడ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పలు విషయాలు పంచుకున్నారు. అక్కినేని నాగేశ్వరరావు తెలుగు సినిమాకు చేసిన కృషిని మోదీ కొనియాడారు. తెలుగు సినిమాను ఆయన మరోస్థాయికి తీసుకువెళ్లారని ప్రశంసించారు. నాగేశ్వరరావు సినిమాల్లో భారతీయ సంప్రదాయాలు, విలువలను చాలా చక్కగా చూపించేవారని గుర్తు చేసుకున్నారు. బాలీవుడ్ దర్శకుడు తపన్ సిన్హా సినిమాలు సమాజానికి కొత్త బాటలు వేశాయని పేర్కొన్నారు. రాజ్‌కపూర్ తన సినిమాల ద్వారా భారతదేశంలోని సున్నితమైన అంశాలను ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. భారతీయ చలనచిత్ర రంగం వైపు ప్రపంచ దేశాలు చూస్తున్నాయని ప్రధాని అన్నారు. తొలిసారిగా వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ వచ్చే ఏడాది మన దేశంలో నిర్వహించబోతున్నామని ప్రధాని చెప్పారు. ఈ సమ్మిట్‌లో మీడియా, వినోద పరిశ్రమకు చెందిన ప్రపంచ దేశాల దిగ్గజాలు పాల్గొంటాయని



తెలిపారు.

అనంతరం రాజ్యాంగ విలువల గురించి మాట్లాడుతూ.. రాజ్యాంగం భారతీయులందరికీ ఓ మార్గనిర్దేశకం అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఓ ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ పవిత్ర గ్రంథంపై ప్రజలు తమ అభిప్రాయాలను వీడియోలుగా రూపొందించి.. ఈ వెబ్‌సైట్‌లో పంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ 75 ఏళ్ల సంబరాల్లో ప్రజలను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో దీనిని రూపొందించామన్నారు. అంతేకాకుండా ఈ వెబ్‌సైట్‌లో అనేక భారతీయ భాషల్లో రాజ్యాంగాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని.. అన్ని భాషల వారు రాజ్యాంగ పీఠికను.. అనేక విషయాలను చదివి.. అర్థం కాని వాటిపై ప్రశ్నలు సైతం అడగవచ్చని ప్రధాని తెలిపారు.

జనవరి 13 నుంచి ప్రయాగ్‌రాజ్‌లో జరగనున్న మహాకుంభ మేళాను ఐక్యతా మేళాగా అభివర్ణించారు. దీనికి సంబంధించిన టూర్ ప్యాకేజీలు, వసతి వంటి సమాచారం తెలుసుకోవడానికి భక్తులకు ఏఐ చాట్‌బాట్ 11 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంటుందన్నారు. అందులోని డిజిటల్ నావిగేషన్ సహాయంతో భక్తులు కుంభమేళాలోని వివిధ ఘాట్లు, దేవాలయాలు, సాధువుల శిబిరాలను చేరుకోగలుగుతారని పేర్కొన్నారు. కుంభమేళాలో తప్పిపోయిన వారిని కనుగొనడానికి ఏఐ ఆధారిత కెమెరాలను, డిజిటల్ లాస్ట్ అండ్ ఫౌండ్ సెంటర్లను ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా. రోబోటిక్ ఫైర్ టెండర్లు సైతం వినియోగిస్తున్నట్లు మోదీ తెలిపారు.

# గాంధీయేతర కాంగ్రెస్ నేతల పట్ల గాంధీ కుటుంబం చిన్నచూపే

## ◆కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి విమర్శ



అగర్తల: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను కేంద్ర ప్రభుత్వం అవమానించిందని కాంగ్రెస్ చేసిన ఆరోపణలపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మారకం నిర్మించే ప్రాంతంలో కాకుండా నిగంబోద్‌లో అంత్యక్రియలు నిర్వహించిన విషయంపై కూడా కాంగ్రెస్ నేతలు రాజకీయాలు చేయాలని చూడడం దురదృష్టకరమని అన్నారు. "గాంధీ కుటుంబం" గాంధీయేతర కాంగ్రెస్ నేతలను ఎన్నడూ గౌరవించలేదని.. ఇప్పుడు తమపై తప్పుడు ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టారు.

మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ మరణించిన అనంతరం ఆయనకు నివాళులర్పించేందుకు కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సమావేశం కూడా ఏర్పాటు చేయలేదని ఆయన కుమార్తె శర్మిష్ఠా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు, సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు కూడా ఆ పార్టీ తగిన గౌరవం ఇవ్వలేదని అన్నారు. వీటన్నింటిపై గాంధీ కుటుంబం ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు.

"మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌తో మాకు సైద్ధాంతిక, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, ఆయన అత్యంత గౌరవప్రదమైన వ్యక్తి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా మన్మోహన్ అంత్యక్రియలకు ప్రభుత్వం తరఫున పూర్తి బాధ్యతను తీసుకొని ఆయనకు తగిన గౌరవాన్ని ఇచ్చారు" అని కేంద్రమంత్రి అన్నారు.

మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు నిర్వహించే ప్రదేశంలోనే స్మారక స్థలం నిర్మించాలని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీని కోరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠా ముఖర్జీ ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. తన తండ్రి చనిపోయినప్పుడు నివాళులర్పించేందుకు కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సమావేశం కూడా ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. ఈవిషయంలో కాంగ్రెస్ తనను తప్పుదోవ పట్టించిందని కూడా ఆరోపించారు. రాష్ట్రపతులకు ఆ సంప్రదాయం పాటించడం లేదని కాంగ్రెస్‌లోని ఓ సీనియర్ నేత తనకు చెప్పారన్నారు. అయితే.. తన తండ్రి డైరీని చదివితే అది నిజం కాదని తెలిసిందన్నారు. రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్‌కు నివాళులర్పించేందుకు సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించినట్లు అందులో ఉందని వెల్లడించారు.



# నేడు పీఎస్ఎల్‌వీ సీ-60 రాకెట్ ప్రయోగం

శ్రీహరికోట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో ప్రయోగానికి సిద్ధమయ్యింది. పీఎస్ఎల్‌వీ సీ-60 రాకెట్‌ను శ్రీహరికోటలోని షార్‌లో రెండో ప్రయోగ వేదిక నుంచి సోమవారం రాత్రి 9.58 గంటలకు నింగిలోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ రాకెట్ ప్రయోగానికి సంబంధించి ఆదివారం రాత్రి 8.58 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. పీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది 62వ ప్రయోగం కాగా పీఎస్ఎల్‌వీ కోర్ అలోన్ దశతో చేసే 18వ ప్రయోగమిది. సోమవారం నింగికేగనున్న పీఎస్ఎల్‌వీ సీ60 రాకెట్ 320 టన్నుల బరువు, 44.5 మీటర్ల ఎత్తు ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు.

స్ట్రాపాన్ బూస్టర్లను ఉపయోగించకపోవడంతో ఈ రాకెట్ బరువు 229 టన్నులుగా ఉంటుందని వివరించారు. రాకెట్‌లో రెండో దశకు ద్రవ ఇంధనం, మూడో దశకు ఘన ఇంధనం, నాలుగో దశకు ద్రవ ఇంధనాన్ని వినియోగించనున్నట్లు వివరించారు. ఇస్రో రూపొందించిన స్పాడెక్స్ అనే జంట ఉపగ్రహాలు ఈ ప్రయోగంలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, వీటికి ఛేజర్, టార్గెట్ అనే పేర్లను నామకరణం చేశామన్నారు. ఈ ఉపగ్రహాలు స్పేస్ డాకింగ్, ఫార్మేషన్ ఫ్లయింగ్, మానవ అంతరిక్షయానం వంటి సేవలకు ఉపయోగపడతాయని స్పష్టం చేశారు.



# మనం అప్రమత్తంగా ఉండాల్సిందే..!

## ◆రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్య

భోపాల్: భారత భద్రతా వ్యవస్థపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భద్రత విషయంలో మనం అంత అదృష్టవంతులం కాదని అన్నారు. బాహ్యంగా, అంతర్గతంగా శత్రువుల కదలికలపై దృష్టి పెట్టాలని సైన్యానికి సూచించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లాలోని మావ్ కంటోన్మెంట్ వద్ద ఆదివారం ఆర్మీ సిబ్బందిని ఉద్దేశించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

"దేశ భద్రతను పరిగణనలోకి తీసుకుంటే మనం అంత అదృష్టవంతులం కాదు. ఎందుకంటే... ఉత్తర, పశ్చిమ సరిహద్దు ప్రాంతాల్లో నిత్యం సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోంది. అంతేకాకుండా.. అంతర్గతంగానూ భద్రతాపరమైన ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాం. ఈ పరిస్థితి పట్ల ఆందోళన లేకుండా నిశ్చబ్దంగా కూర్చోలేం. శత్రువుల కార్యకలాపాలపై మరింత నిఘా అవసరం. వారి కదలికలను గమనిస్తూనే ఉండాలి. అప్పుడే వారి కుట్రను భగ్నం చేయగలం" అని రాజ్‌నాథ్ సింగ్ ఆర్మీ సిబ్బందికి సూచించారు..

భారత్ అభివృద్ధి ప్రయాణంలో సైన్యం పాత్ర కీలకమని అన్నారు. "రక్షణమంత్రిగా నేను మీకు ఒక విషయం చెప్పాలనుకుంటున్నా.. నేను ఇక్కడకు వచ్చినప్పుడల్లా మీరు తీసుకుంటున్న కఠినమైన శిక్షణతో పాటు మీ అంకితభావాన్ని చూశాను. దేశం పట్ల బాధ్యతాయుతమైన మీ తీరు.. మాలో స్ఫూర్తి నింపుతోంది" అని అన్నారు.



# ముంబై బాలిక ప్రపంచ రికార్డ్!

## - ఏడు అత్యంత ఎత్తైన పర్వతాలను అధిరోహించిన 16 ఏళ్ల బాలిక

ముంబై: ముంబైకు చెందిన 16 ఏళ్ల కామ్యా కార్తికేయన్ పర్వతారోహణలో ప్రపంచ రికార్డును సాధించింది. ఏడు ఖండాల వ్యాప్తంగా ఏడు అత్యంత ఎత్తైన పర్వతాలను అధిరోహించిన అతి పిన్నవయస్కురాలైన బాలికగా కామ్యా చరిత్ర సృష్టించింది. ఏడు పర్వతాలను అధిరోహించే సవాల్‌ను స్వీకరించిన కామ్య మౌంట్ కిలిమంజారో (ఆఫ్రికా), మౌంట్ ఎల్‌బ్రస్ (యూరప్), మౌంట్ కాజియాస్కో (ఆస్ట్రేలియా), మౌంట్ అకాన్‌కాగువా (దక్షిణ అమెరికా), మౌంట్ డెనలి (ఉత్తర అమెరికా), మౌంట్ ఎవరెస్ట్ (ఆసియా), మౌంట్ విన్సన్ (అంటార్కటికా)లను విజయవంతంగా అధిరోహించింది. తన తండ్రి కమాండర్ కార్తికేయన్‌తో కలిసి మౌంట్ విన్సన్ చేరుకున్న కామ్య డిసెంబర్ 24న సప్త పర్వతాధిరోహణ సవాల్‌ను పూర్తిచేసింది. ముంబైలోని నేవీ చిల్డ్రన్ స్కూల్‌లో 12వ తరగతి చదువుతున్న కామ్య, ఆమె తండ్రి కమాండర్ కార్తికేయన్‌ను భారతీయ నేవీ అభినందించింది. ఉత్తర ధ్రువం, దక్షిణ ధ్రువం చేరుకోవడాన్ని తన తదుపరి లక్ష్యంగా కామ్య నిర్దేశించుకుంది.

# మన్మోహన్‌సింగ్ అస్థికల నిమజ్జనం

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అస్థికలను ఆదివారం యమునా నదిలో నిమజ్జనం చేశారు. శనివారం ఢిల్లీలోని నిగమ్ బోధ్ ఘాట్‌లో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరగ్గా ఆదివారం ఉదయం అక్కడి నుంచి ఆయన కుటుంబ సభ్యులు అస్థికలను సేకరించారు. అనంతరం యమునా నది సమీపంలోని 'మజ్ను కా తిలా' గురుద్వారా సమీపంలో కుటుంబ సభ్యులు సిక్కు సంప్రదాయం ప్రకారం ఆయన అస్థికలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మన్మోహన్ సింగ్ సతీమణి గురుశరణ్ కౌర్, కుమార్తెలు ఉపిందర్ సింగ్, దమన్ సింగ్‌బీ అమృత్ సింగ్‌తో పాటు బంధువులు పాల్గొన్నారు.

ఆచారాల్లో భాగంగా జనవరి 1న ఢిల్లీలోని మోతీలాల్ నెహ్రూ మార్గ్‌లోని మన్మోహన్ సింగ్ అధికారిక నివాసంలో అఖండ్ పథ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 3వ తేదీన పార్లమెంటు కాంప్లెక్స్ సమీపంలోని రకాబ్ గంజ్ గురుద్వారా వద్ద భోగ్ వేడుక, అంతిమ్ అర్దాస్, కీర్తన్ జరగనున్నాయి. వయో సంబంధిత సమస్యలతో మన్మోహన్ సింగ్ డిసెంబర్ 26న రాత్రి ఢిల్లీ ఎయిమ్స్‌లో తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే.



# దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం

◆179 మంది దుర్మరణం

◆రన్‌వేపై అదుపు తప్పి గోడను ఢీకొట్టి పేలిన విమానం

◆ ల్యాండింగ్ గేర్ వైఫల్యంతోనే ప్రమాదం

సియోల్: దక్షిణ కొరియాలోని ముయాన్ విమానాశ్రయంలో ఆదివారం ఘోర విమాన ప్రమాదం సంభవించింది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి ముయాన్‌కు వచ్చిన జెజూ ఎయిర్ ఫ్లైట్‌కు చెందిన 7సి2216 బోయింగ్ విమానం ల్యాండ్ అవుతుండగా అదుపుతప్పింది. రన్‌వేపై దిగుతున్న విమానం అదుపుతప్పి గోడను ఢీకొట్టి పేలిపోయింది. దీంతో భారీగా మంటలు చెలరేగాయి. విమానంలోని 179 మంది సజీవ దహనమయ్యారు. మరో ఇద్దరు మాత్రమే ప్రాణాలతో బయపడ్డారు. ఘటనా సమయంలో విమానంలో 175 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది సహా మొత్తం 181 మంది ఉన్నట్లు జెజూ విమానయాన సంస్థ ప్రకటించింది.



కాగా, విమానం ల్యాండ్ కావడానికి ప్రయత్నించిన సమయంలో ల్యాండింగ్ గేర్ సమస్యతోనే ప్రమాదం జరిగినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9 గంటలకు ఈ ఘోర విమాన ప్రమాదం జరిగింది. విమానం రన్‌వేపై ల్యాండ్ అవుతున్న సమయంలో ముందు చక్రం తెరుచుకోకపోవడంతో విమానం రన్‌వేకు తగిలింది. ఈ క్రమంలో విమానం అదుపు తప్పి రన్‌వే పక్కన ఏర్పాటు చేసిన కాంక్రీటు గోడను ఢీకొట్టడంతో విమానంలో ఇంధనం ఒక్కసారిగా మండిపోయి మంటలు వ్యాపించాయని తెలిపారు. దట్టమైన నల్లని పొగలు ఆ ప్రాంతమంతా వ్యాపించాయి. 32 అగ్నిమాపక ట్రక్కులు, హెలికాప్టర్లు హుటాహుటిన అక్కడి చేరుకుని మంటలను అదుపు చేశాయి. అయితే అప్పటికే అంతా మృత్యువాతపడ్డారు. ఇద్దరు విమాన సిబ్బంది మినహా మిగతా అందరూ చనిపోయినట్లు నట్లు అధికారులు వెల్లడించారు. వారిలో 173 మంది దక్షిణ కొరియాకు చెందినవారు కాగా, ఇద్దరు థాయ్ జాతీయులని తెలిపారు.

ఈ ప్రమాదంపై తాత్కాలిక అధ్యక్షుడు చోయ్ సాంగ్ మోక్ స్పందించారు. తక్షణమే అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా, ప్రమాదం నేపథ్యంలో ముయాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో అన్ని విమానాల రాకపోకలను రద్దు చేశారు.



# రెండు విమానాలకు తప్పిన ప్రమాదాలు

దక్షిణ కొరియాలోని ముయాన్ ఎయిర్ ఎయిర్‌పోర్ట్‌లో చోటుచేసుకున్న ఘోర విమాన ప్రమాదంలో 179 మంది ప్రాణాలు కోల్పోగా... కొన్ని గంటల తేడాతో మరో రెండు విమానాలు వేర్వేరు దేశాల్లో అలాంటి ప్రమాదాలనే తప్పించుకున్నాయి. ఎయిర్ కెనడాకు చెందిన విమానానికి శనివారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. హాలిఫాక్స్ ఎయిర్‌పోర్టులో ఎయిర్ కెనడాకు చెందిన ఏసీ2259 విమానం అత్యవసరంగా ల్యాండ్ అయింది.

ఆ సమయంలో దాని ల్యాండింగ్ గేర్ విఫలం కావడంతో రన్‌వేపై ఓ పక్కకు జారిపోయి మంటలు వచ్చాయి. ఈ విమానం కెనడాలోని సెయింట్ జోన్స్ నుంచి హాలిఫాక్స్కు ప్రయాణిస్తోంది. ఇది డాష్ 8-400 రకం విమానంగా గుర్తించారు. ఈ ప్రమాదంలో దాని రెక్కలు పూర్తిగా రన్‌వేకు రాసుకుపోయాయి. ఆ సమయంలో మంటలు వచ్చినట్లు ప్రయాణికులు తీసిన వీడియో దృశ్యాల్లో కనిపిస్తున్నాయి. దీంతో ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా మూసివేశారు. దక్షిణ కొరియాలో విమాన ప్రమాదం జరిగిన కొన్ని గంటల్లోనే ఇది చోటు చేసుకొంది.

### నార్వేలో కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్

రాయల్ డచ్‌కు చెందిన విమానం ఒకటి నార్వేలోని టోర్ప్ ఎయిర్‌పోర్టులో రన్‌వేపై అదుపు తప్పింది. బోయింగ్ 737-800 శ్రేణికి చెందిన విమానం ఇది. ఓస్లో ఎయిర్ పోర్టులో టేకాఫ్ తీసుకొన్న వెంటనే.. హైడ్రాలిక్ ఫెయిల్యూర్ చోటుచేసుకొంది. దీంతో 110 కిలోమీటర్ల దూరంలోని టోర్ప్ ఎయిర్ పోర్టుకు దీనిని మళ్లించారు. ఇది సురక్షితంగా నేలపైకి దిగినా.. రన్‌వేపై మాత్రం అదుపుతప్పింది. ఈ విషయాన్ని ఏవియేషన్ 24 సంస్థ పేర్కొంది. కాకపోతే ఇది సురక్షితంగా సమీపంలోని గడ్డి మైదానంలోకి వెళ్లి ఆగిపోయింది. ఈ ఘటన జరిగిన సమయంలో విమానంలో మొత్తం 182 మంది ఉన్నారు. ప్రయాణికులను అత్యవసరంగా విమానం నుంచి దించేశారు. విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసేసి సహాయక చర్యలు చేపట్టారు. బోయింగ్ 737-800 శ్రేణి విమానమే దక్షిణ కొరియాలో ప్రమాదానికి గురైంది.

# హెచ్1 బీ వీసాలకు నేనెప్పుడూ అనుకూలమే..

◆ డొనాల్డ్ ట్రంప్ స్పష్టీకరణ

వాషింగ్టన్: హెచ్1 బీ వీసాల విస్తరణపై డొనాల్డ్ ట్రంప్ పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్, భారతీయ- అమెరికన్ వివేక్ రామస్వామి ఈ చట్టబద్ధమైన వలసలకు మద్దతు ఇచ్చారు. దీనిపై అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. నైపుణ్యం కలిగిన కార్మికులు, ఉద్యోగులు అమెరికాకు రావడానికి ఉపయోగపడే ప్రత్యేక వీసా ప్రోగ్రాంకు తాను మద్దతిస్తున్నానని తెలిపారు. తాను ఎల్లప్పుడూ హెచ్1 బీ వీసాలకు అనుకూలంగా ఉంటానని అన్నారు. అందుకే తమ దేశంలో ఆ వీసాలు ఉన్నాయని తెలిపారు.

అమెరికా ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులే లక్ష్యంగా ఏర్పాటు చేసిన డిపార్ట్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీకి సంయుక్త సారథులుగా నియమితులైన మస్క్, వివేక్ రామస్వామి ఈ విషయంపై మాట్లాడారు. యూఎస్ తక్కువ స్థాయిలో నైపుణ్యం గల గ్రాడ్యుయేట్లను తయారు చేస్తున్నందున



ఇతర దేశాల నుంచి అమెరికాకు వచ్చే నైపుణ్యం గల వారిని దేశంలోకి అనుమతించడానికి హెచ్1బీ వీసా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. టాలెంట్ ఎక్కడున్నా దానిని అందిపుచ్చుకోవాలని అన్నారు. ప్రపంచ దేశాల్లో అమెరికా ఎప్పటికీ మొదటి స్థానంలో ఉండాలంటే ఈ ప్రోగ్రాంకు మద్దతివ్వాలని కోరారు. మస్క్ కూడా హెచ్1బీ వీసా పైనే అమెరికాకు వలస వచ్చారు.

కాగా ఈ విషయంపై పలువురు భిన్న వాదనలు వినిపించారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన నిక్కీ హేలీ మాట్లాడుతూ తాను సౌత్ కరోలినా గవర్నర్‌గా పనిచేసిన సమయంలో నిరుద్యోగిత రేటు 11 శాతం నుంచి 4 శాతానికి పడిపోయిందని అన్నారు. విదేశీ ఉద్యోగులను కాకుండా పెట్టుబడులను మాత్రమే ఆహ్వానించాం కాబట్టే అది సాధ్యమైందని.. కొత్త ఉద్యోగాల కోసం ప్రజలకు శిక్షణ ఇవ్వడం వల్ల వారు ఇప్పుడు విమానాలు, ఆటోమొబైల్స్ తయారీలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకానీ అమెరికన్లను తక్కువ అంచనా వేయొద్దని తన అభిప్రాయాన్ని వినిపించారు. ప్రత్యేక నిపుణులైన విదేశీయులను మరింత తేలిగ్గా నియమించుకొనేందుకు అమెరికా కంపెనీలకు అవకాశం కల్పిస్తూ బైడెన్ కార్యవర్గం పలు నిబంధనల్లో మార్పులు చేసింది. దీంతోపాటు సులువుగా ఎఫ్-1 విద్యార్థి వీసాలను హెచ్-1బీ వీసాలుగా మార్చుకొనే అవకాశం కల్పించింది. ఇది లక్షల మంది భారతీయ వృత్తి నిపుణులకు ప్రయోజనం కల్పించనుంది. ఈ వీసా నాన్ ఇమిగ్రెంట్ కేటగిరీలోకి వస్తుంది. టెక్నాలజీ కంపెనీలు విదేశీ వృత్తి నిపుణులను దీని సాయంతో నియమించుకొంటుంటాయి. ముఖ్యంగా భారత్, చైనా దేశాలు ఈ వీసా నుంచి చాలా లబ్ధి పొందాయి.

# చైనాలో మరో హైస్పీడ్ రైలు!

బీజింగ్: వరుస ఆవిష్కరణలతో ప్రపంచంలో తన సత్తా చాటుతోంది. తాజాగా గంటకు అత్యధికంగా 450 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే బుల్లెట్ రైలును ప్రపంచానికి పరిచయం చేసింది. దీనిని సీఆర్450గా వ్యవహరిస్తోంది. ఆదివారం బీజింగ్‌లో దీనిని పరీక్షించారు. గంటకు 400 కిలోమీటర్ల వేగాన్ని అందుకొంది. ఈ రైల్ డిజైన్ చాలా నాజుగ్గా, బుల్లెట్ షేప్ ముక్కుతో ఉంటుందని చైనా రైల్వే వెల్లడించింది. ఇది అత్యధికంగా గంటకు 450 కీమీ వేగాన్ని అందుకోగలదని తెలిపింది. ఇది వినియోగంలోకి వచ్చే నాటికి ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వాణిజ్య రైలుగా నిలుస్తుందని చెప్పింది. ఈ రైలు బీజింగ్ నుంచి షాంఘైకి కేవలం 2.5 గంటల్లోనే ప్రయాణించగలదు. గతంలో ఈ ప్రయాణానికి నాలుగు గంటల సమయం పట్టేది. ప్రస్తుతం చైనాలోని హైస్పీడ్ రైలు వ్యవస్థ అతిపెద్దది. మొత్తం 45 వేల కిలోమీటర్ల మేరకు విస్తరించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే చైనా ప్రభుత్వరంగ రైల్వే సంస్థ సీఆర్450 ప్రొటోటైప్ను డిసెంబర్‌లో పరీక్షిస్తామని పేర్కొంది.



# 200 ప్రత్యేక జైళ్లను నిర్మిస్తున్న చైనా!

బీజింగ్: చైనాలో సర్కారు సరికొత్తగా 200 ప్రత్యేకమైన జైళ్లను నిర్మిస్తోంది. అధ్యక్షుడు జిన్ పింగ్ చేపట్టిన అవినీతి వ్యతిరేక కార్యక్రమంలో వినియోగించేందుకు వీలుగా వీటిని నిర్మిస్తోంది. ఈ విషయాన్ని ఆంగ్ల మీడియా సీఎన్ఎన్ కథనంలో పేర్కొంది. వీటిని లియుజూ కేంద్రాలుగా వ్యవహరిస్తున్నారు. వీటిల్లో అనుమానితులను కుటుంబంతో కలవకుండా.. న్యాయ సాయం అందించకుండా దాదాపు 6 నెలల వరకు బంధించి ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

2012లో జిన్ పింగ్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పార్టీపై పట్టు బిగిస్తున్నారు. వరుసగా అధికారం చేపట్టడం ఇది మూడోసారి. ఆయన మొదటి నుంచి అవినీతిపై పోరాటం పేరిట తన అసమ్మతి వర్గాన్ని జైల్లో వేస్తారన్న విమర్శలను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే గతంలో ఉన్న షువాంగి వ్యవస్థకు చెద్దపేరు రావడంతో తాజాగా లియుజూ కేంద్రాలతో భర్తీ చేయనున్నారు. 24 గంటలూ గస్తీ, నిఘా కెమెరాలు వంటి ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిల్లో కేవలం కమ్యూనిస్టు పార్టీ అధికారులే కాదు.. అధికారులు, సివిల్ సర్వెంట్లు, హైప్రొఫైల్ వ్యక్తులు, వ్యాపారవేత్తలు వంటి వారిని లక్ష్యంగా చేసుకోనున్నట్లు తెలుస్తోంది. 2017-2024 మధ్యలో 210 లియుజూ సెంటర్లను నిర్మించడమో.. విస్తరించడమో చేశారు. ఇక్కడ బంధించిన వారిని కనీసం సరిగ్గా నిద్ర కూడా పోనీయరు. వారు దాదాపు 18 గంటల సేపు కూర్చొనే ఉండాలని ఈ కేంద్రాల్లో పనిచేసిన మాజీ అధికారి ఒకరు తెలిపారు. ఈ కేంద్రాలను నిర్మించడానికి ప్రత్యేకమైన నిబంధనలున్నాయి. 2023 నుంచి 2027 వరకు నిర్మాణం చేపట్టే వాటిల్లో ఖైదీలు తమకు తాము ఎటువంటి హాని చేసుకోవడానికి వీల్లేకుండా చూడనున్నారు. ఇందుకోసం ప్యాడెడ్ వాల్, యాంటీ స్లిప్ సర్ఫేస్ వంటివి నిర్మిస్తున్నారు.



# బాక్సింగ్ డే టెస్ట్.. టీమిండియాకు భారీ టార్గెట్




ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్ వేదికగా భారత్ నాలుగో టెస్టు ఆడుతోంది. నాలుగో రోజు ఆట ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ 228/9 స్కోరుతో నిలిచింది. దీంతో 333 పరుగుల లీడ్ సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 474 పరుగులు చేయగా భారత్ 369 పరుగులకు ఆలౌటైంది. దీంతో బాక్సింగ్ డే టెస్టులో టీమ్ఇండియాకు భారీ లక్ష్యమే ఎదురైంది. సోమవారం ఆటకు చివరి రోజు. ఆట కూడా షెడ్యూల్ కంటే అర్ధ గంట ముందే ప్రారంభం కానుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం 4.30 గంటలకు మొదలవుతుంది. ఒకవేళ భారత్ ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే దాదాపు 96 ఏళ్ల నుంచి కొనసాగుతున్న ఓ రికార్డు తుడిచిపెట్టుకుపోనుంది. ఈ క్రమంలో మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో టెస్టుల్లో అత్యధిక లక్ష్య ఛేదన ఎంత? భారత్ మెల్‌బోర్న్‌లో ఎన్ని సార్లు సక్సెస్‌ఫుల్‌గా రన్ ఛేజ్ చేసింది అవన్నీ ఈ స్టోరీలో తెలుసుకుందాం.

- ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 228/9
- ప్రస్తుత ఆధిక్యం: 333
- భారత్ తొలి ఇన్నింగ్స్: 369
- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 474

### హైయ్యస్ట్ ఛేజింగ్ రికార్డు

మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో ఇంగ్లాండ్ 1928లో 332 పరుగులను లక్ష్యాన్ని ఛేదించింది. ఇదే మెల్‌బోర్న్‌లో అత్యధిక పరుగుల ఛేజింగ్. ఇప్పటివరకు మెల్‌బోర్న్‌లో జరిగిన టెస్టుల్లో ఇంగ్లాండ్ (8), ఆసీస్ (21) సార్లు విజయవంతంగా ఛేజింగ్ చేశాయి. 1953లో దక్షిణాఫ్రికా ఒకసారి 297 పరుగుల లక్ష్యాన్ని సక్సెస్ ఫుల్‌గా ఛేదించింది.

### రెండు జట్లే

ఉపఖండంలోని జట్ల విషయానికొస్తే, 2020 డిసెంబర్‌లో ఆసీస్‌పై భారత్ 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. 70 పరుగుల లక్ష్యాన్ని 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. 2008లో దక్షిణాఫ్రికా183 పరుగుల లక్ష్యాన్ని ఒక్క వికెట్ కోల్పోయి ఛేజ్ చేసింది. ఇప్పటివరకు ఈ రెండు జట్లు మినహా ఉపఖండంలోని ఇంకే జట్లు ఛేజింగ్‌లో మెల్‌బోర్న్ క్రికెట్ స్టేడియంలో గెలవలేదు.

### రెండు సార్లు మాత్రమే

కాగా, ఇప్పటివరకు ఆసీస్ పిచ్‌లపై రెండు మాత్రమే టీమ్ఇండియా 200కు పైగా పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. 2021 జనవరిలో జరిగిన చారిత్రక బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భాగంగా బ్రిస్బేన్‌లో జరిగిన టెస్టులో 328 పరుగుల లక్ష్యాన్ని భారత్ ఛేదించింది. అలాగే 2003లో జరిగిన అడిలైడ్ టెస్టులో టీమ్ఇండియా 230 పరుగుల లక్ష్యాన్ని ఛేజ్ చేసింది.

### బోర్డర్- గావస్కర్‌లో

బోర్డర్-గావస్కర్ ట్రోఫీ చరిత్రలో 19 విజయవంతమైన రన్ ఛేజ్‌లు జరిగాయి. అందులో భారత్ 12 సార్లు భారత్, 7 సార్లు ఆసీస్ ఛేజింగ్ చేశాయి. టాప్- 11 రన్ ఛేజింగ్‌లలో తొమ్మిది భారత్‌వే కావడం విశేషం. ఆస్ట్రేలియాలో భారత్ 200 ప్లస్ పరుగుల లక్ష్యాన్ని ఒకసారి, 300 ప్లస్ పరుగుల లక్ష్యాన్ని ఒకసారి ఛేదించింది.

# గవాస్కర్ కాళ్లు మొక్కిన నితీష్‌రెడ్డి తండ్రి..

భారత యువ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్ టెస్టులో 8వ స్థానంలో వచ్చి అద్భుతమైన సెంచరీ చేయడంతో ఆయన తండ్రి ముత్యాల రెడ్డి ఎంతో ఎమోషనల్ అయ్యారు. మ్యాచ్ అనంతరం నితీష్ తండ్రి ముత్యాలరెడ్డి సునీల్ గవాస్కర్ కాళ్లు మొక్కారు. ఆ తర్వాత నితీష్ రెడ్డి సోదరి కూడా గవాస్కర్ పాదాలకు నమస్కరించారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.





మెల్‌బోర్న్ టెస్టు మూడో రోజు ఆట ముగిసిన అనంతరం నితీష్ కుమార్ రెడ్డి కుటుంబం గవాస్కర్‌తో సమావేశమైంది. ఈ సమావేశంలో నితీష్ తండ్రి భావోద్వేగానికిలోనయ్యారు. గవాస్కర్ కనిపించగానే ఆయనను ఆలింగనం చేసుకోవడానికి ముందు కాళ్లపై పడ్డారు. మోకాళ్లపై కూర్చుని కాళ్లు మొక్కారు. అదేవిధంగా తన కుమారుడిపై ప్రశంసలు కురిపించిన మాజీ ఆటగాళ్లు అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సమావేశంలో సునీల్ గవాస్కర్.. నితీష్ కుమార్ రెడ్డి గురించి, అతని బ్యాటింగ్ గురించి మాట్లాడారు. ఆతనో వజ్రమని కితాబిచ్చాడు. మెల్‌బోర్న్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 8వ స్థానంలో క్రీజులోకి వచ్చిన నితీష్ రెడ్డి.. 189 బంతులు ఎదుర్కొని 114 పరుగులు చేశాడు. దాంతో ఇన్నింగ్స్‌లో భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. నితీష్ ఆటను టెస్టు చరిత్రలోనే అత్యుత్తమ ఇన్నింగ్స్‌గా క్రికెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

తాజా ఇన్నింగ్స్‌తో భారత టెస్టు చరిత్రలో 8వ నంబర్ బ్యాట్స్‌మెన్‌గా బరిలో దిగి రెండో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నితీష్ నిలిచాడు. అంతకుముందు 2002లో వెస్టిండీస్‌పై అజయ్ రాత్రా అజేయంగా 115 పరుగులు చేశాడు. కాగా మెల్‌బోర్న్‌లో సాధించిన సెంచరీని నితీష్ కుమార్ రెడ్డి తన తండ్రికి అంకితమిచ్చాడు.

## నితీష్ రెడ్డికి పవన్ ప్రశంసలు



ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టెస్టులో అదరగొట్టిన తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డిపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా నితీశ్ సాధించిన ఘనతపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా స్పందించారు.

"మీరు భారత్‌లోని ఏ ప్రదేశం నుంచి వచ్చారనేది కీలకం కాదు. కానీ, దేశం కోసం మీరు ఏం చేశారనేది చాలా ముఖ్యం. ప్రస్తుతం మీరు మన దేశ గౌరవాన్ని మరింత పెంచారు. డియర్.. నితీశ్ కుమార్ రెడ్డి. ఆస్ట్రేలియా గడ్డపై టెస్టులో సెంచరీ సాధించారు. భారత్ నుంచి ఈ ఘనత సాధించిన అతిపిన్న వయస్కుడిగా చరిత్ర సృష్టించారు. భవిష్యత్తులో మీరు మరిన్ని రికార్డులు నెలకొల్పాలని ఆశిస్తున్నా. దేశ గౌరవాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లండి. యువతకు క్రీడల పట్ల ఆసక్తి పెరిగేలా స్ఫూర్తినివ్వాలి. ఈ సిరీస్లో భారత్ ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని పవన్ పోస్టు చేశారు.

కాగా.. బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో భాగంగా జరుగుతున్న నాలుగో టెస్టు తొలి ఇన్నింగ్స్ నితీశ్ కుమార్ అదరగొట్టిన సంగతి తెలిసిందే. పేస్ ఆల్రౌండర్గా జట్టులోకి వచ్చిన అతడు మెల్బోర్న్ టెస్టులో జట్టును ఫాల్ ఆన్ గండం నుంచి బయటపడేశాడు. ఈ క్రమంలో టెస్టు కెరీర్లో 171 బంతుల్లో తొలి శతకం సాధించి ప్రశంసలు అందుకుంటున్నాడు.

# చరిత్ర సృష్టించిన దక్షిణాఫ్రికా

## డబ్ల్యూటీసీ 2025 చేరిన మొదటి జట్టు




దక్షిణాఫ్రికా చరిత్ర సృష్టించింది. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్ 2025 చేరిన మొట్టమొదటి జట్టుగా ఆవిర్భవించింది. డబ్ల్యూటీసీ ఫైనల్స్ చేరడం కూడా ఇదే తొలిసారి.ఇక రెండో స్థానం కోసం ప్రస్తుతానికి మూడు జట్లు పోటీ పడుతోన్నాయి. ఆస్ట్రేలియా, భారత్, న్యూజిలాండ్ జట్లకు ఆ అవకాశం ఉంది.

సెంచూరియన్ పార్క్ స్టేడియంలో పాకిస్తాన్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో ఘన విజయాన్ని సాధించింది దక్షిణాఫ్రికా. రెండు వికెట్ల తేడాతో పాక్‌ను మట్టికరిపించింది. గెలవడానికి అవసరమైన 147 పరుగులను అతి కష్టం మీద ఛేదించింది. ఎనిమిది వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది.

ఈ విజయంతో డబ్ల్యూటీసీ ఫైనల్స్‌లో బెర్తును ఖరారు చేసుకుంది దక్షిణాఫ్రికా. 2025 జూన్ 11వ తేదీన లండన్‌లోని లార్డ్స్ స్టేడియం ఈ ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యాన్ని ఇవ్వనుంది. ఫైనల్స్‌లో దక్షిణాఫ్రికాను ఢీ కొట్టబోయే జట్టు ఏది అనేది ఇంకా తేలాల్సి ఉంది. ఈ రేసులో ఆస్ట్రేలియా ముందంజలో ఉంది.

పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఆస్ట్రేలియా, మూడో స్థానంలో భారత్, ఫోర్త్ ప్లేస్‌లో న్యూజిలాండ్ ఉన్నాయి. మ్యాచ్ గెలిస్తే 12 పాయింట్లు లభిస్తాయి ఒక్కో జట్టుకు. మ్యాచ్ టై అయితే- 6, డ్రా అయితే- 4 పాయింట్లు అందుతాయి. పాయింట్ల పర్సంటేజీ ఆధారంగా చేసుకుని ర్యాంకులను నిర్ధారిస్తుంది ఐసీసీ. ప్రస్తుతం ఈ పాయింట్ల పట్టికలో దక్షిణాఫ్రికా 11 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది.


సెంచూరియన్ స్టేడియంలో జరిగిన తొలి టెస్ట్ తొలి ఇన్నింగ్‌లో 211, రెండో ఇన్నింగ్‌లో 237 పరుగులు చేసింది పాకిస్తాన్. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్‌లో 301 పరుగులతో రాణించింది. గెలవడానికి 147 పరుగులు అవసరం కాగా.. దీన్ని సాధించడానికి చెమటోడ్చాల్సి వచ్చింది.

ఒక దశలో 99 పరుగులకు ఎనిమిది వికెట్లను కోల్పోయింది దక్షిణాఫ్రికా. ఓటమి తప్పదనే అనుకున్నారంతా. ఆ దశలో క్రీజ్‌లో నిలిచిన కగిసొ రబడ, మార్కొ జెన్‌సెన్.. నిప్పులు చెరిగిన పాకిస్తాన్ బౌలర్లను ఎదురొడ్డి నిలిచారు. ధీటుగా ఎదుర్కొన్నారు. జట్టును విజయపథం వైపు నడిపించారు.

టోనీ డీ జోర్జీ- 2, ఎయిడెన్ మార్క్‌రమ్- 37, ర్యాన్ రికెల్టన్- 0, ట్రిస్టన్ స్టబ్స్- 1, కెప్టెన్ టెంబా బావుమా- 40, డేవిడ్ బెడింగ్హమ్- 14, కైలె వెర్రెయిన్- 2, కార్బిన్ బోష్- సున్నా పరుగులు చేశారు. లోయర్ మిడిలార్డర్ బ్యాటర్లు మార్కొ జెన్‌సెన్, కగిసొ రబడ వెన్ను చూపలేదు. మడమ తిప్పలేదు. చివరి వరకు పోరాడారు. జెన్‌సెన్- 16, రబడ- 31 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు.

చైతన్యరథం

# 'చరణ్' భారీ కటౌట్.. అదుర్స్!




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌కు ఆయన అభిమానులు భారీ సర్ప్రైజ్ ఇచ్చారు. ప్రపంచంలోనే అత్యంత భారీ కటౌట్(256 ఫీట్లు)ను ఏర్పాటు చేసి గేమ్ చేంజర్ సినిమా విడుదల వేళ అనూహ్య బహుమతి ఇచ్చారు. విజయవాడలో ఏర్పాటు చేసిన ఈ కటౌట్ను గేమ్ చేంజర్ చిత్ర నిర్మాత దిల్ రాజు ఆదివారం ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర సంగీత దర్శకులు తమన్ కూడా పాల్గొంటున్నారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా భారీ కటౌట్కు పూలాభిషేకం చేయనున్నారు. కాగా, వచ్చే ఏడాది జనవరి 10న ఈ చిత్రం విడుదల కానుంది. శ్రీకాంత్, ఎసీ.సూర్య కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి స్టార్ డైరెక్టర్ ఎస్.శంకర్ దర్శకత్వం వహించారు. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో విడుదల కాబోతోంది.

## 2024 టాలీవుడ్‌లో భారీ హిట్లు ఇవే..

2024 సంవత్సరం టాలీవుడ్‌లో కనకవర్షాన్ని కురిపించింది. చిన్న సినిమాలు కూడా రూ.100 కోట్లు కొల్లగొట్టి టాలీవుడ్ సత్తా చాటాయి. ఇక పెద్ద సినిమాలు అయితే.. మన టార్గెట్ రూ. 2000 కోట్లు అన్నట్లుగా ఇండియన్ బాక్సాఫీస్‌ని ఆశ్చర్యపరిచాయి. సంక్రాంతి హిట్లతో జోరుగా మొదలైన ఈ ప్రయాణం మధ్య కాస్త నిరాశ పరిచినా.. ఇయర్ ఎండింగ్‌కు వచ్చే సరికి మళ్లీ అదే ఊపును కనబరిచింది. ఈ క్రమంలో టాలీవుడ్‌కి 2024లో వచ్చిన భారీ హిట్ సినిమాలను ఒక్కసారి పరిశీలిస్తే..

మహేశ్‌బాబు 'గుంటూరు కారం', నాగార్జున 'నా సామిరంగ' చిత్రాలతో ఈ ఏడాది సంక్రాంతి విజయాలను అందుకున్నారు. ఇక చిన్నసినిమాగా బరిలోకి దిగిన 'హను-మాన్' పాన్ ఇండియా స్థాయిలో భారీ విజయాన్ని నమోదు చేసింది. రూ.50 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి రూ. 300 కోట్లకు పైబడి వసూళ్లను సాధించి అబ్బురపరిచింది. 'టిల్లూ స్క్వేర్' చిత్రంతో యువహీరో సిద్ధు జొన్నలగడ్డ మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. మార్చిలో విడుదలైన ఈ చిత్రం రూ. 130 కోట్ల వసూళ్లతో ఘన విజయాన్ని నమోదు చేసింది.

ఇక ద్వితీయార్థంలో ప్రభాస్ తన పవర్ చూపించారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడి' చిత్రం రూ. వెయ్యి కోట్ల వసూళ్ల క్లబ్‌లో చేరింది. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా శివ కొరటాల దర్శకత్వం వహించిన 'దేవర 1' సినిమా టాలీవుడ్‌తో పాటు హిందీ బెల్ట్‌లోనూ మంచి ఆదరణను సొంతం చేసుకుంది. నాని హీరోగా వివేక్ ఆత్రేయ తెరకెక్కించిన చిత్రం 'సరిపోదా శనివారం'. ఈ సినిమాతో నాని మరో హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు.

కిరణ్ అబ్బవరం ఎదురుచూపులు ఫలించి, ఆయన హీరోగా నటించిన 'క' చిత్రం అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. గ్రామీణ నేపథ్యంలో మర్డర్ మిస్టరీ కథతో తెరకెక్కిన ఈ చిత్రం రూ.50 కోట్ల వసూళ్లను రాబట్టింది. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'లక్కీ భాస్కర్'. బ్యాంకింగ్ రంగంలో మోసాలు, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం రూ. వందకోట్ల వసూళ్లను అధిగమించింది. జాతీయ స్థాయిలో 'పుష్ప 2' ప్రభంజనం కొనసాగుతోంది. దాదాపు 12 వేలకు పైబడి స్క్రీన్లలో విడుదలైన ఈ చిత్రం ఉత్తరాది బెల్ట్‌లో వీరవిహారం చేస్తోంది. రూ. 2 వేల కోట్ల క్లబ్‌కు చేరువలో ఉంది.





## 'అన్ స్టాపబుల్ 4'కి రానున్న 'గేమ్ ఛేంజర్' టీమ్!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా స్టార్ దర్శకుడు శంకర్ కాంబినేషన్లో రాబోతున్న సెన్సేషనల్ ప్రాజెక్ట్ 'గేమ్ ఛేంజర్'. జనవరి 10, 2025న ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. ఈ పొలిటికల్ డ్రామా పై మెగా ఫ్యాన్స్ కి ఇప్పటికే విపరీతమైన అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో కియారా అద్వానీ కథానాయికగా నటించింది. ఐతే, తాజా అప్‌డేట్ ప్రకారం.. గేమ్ ఛేంజర్ టీమ్, 'ఆహా'లో పాపులర్ సెలబ్రిటీ టాక్ షో అయిన 'అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే సీజన్ 4'కి రాబోతుంది.

ఈ స్పెషల్ ఎపిసోడ్ షూటింగ్ రేపు 31న జరగనుంది. మరి ఈ షూటింగ్‌కు రామ్ చరణ్‌తో పాటు ఎవరు వస్తారో చూడాలి. ఇక వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతున్న భారీ చిత్రాల్లో ఈ సినిమా కూడా ఒకటి. ఈ సినిమాలో మరో కీలక పాత్రలో అంజలి కనిపించనుంది. అన్నట్టు గేమ్ ఛేంజర్ నార్త్ ఇండియా థియేటర్స్ రైట్స్‌ను అనిల్ తడాని యొక్క ఏఏ ఫిల్మ్స్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 'గేమ్ ఛేంజర్' విడుదల కానుంది.



## 'ఘాటీ' క్లైమాక్స్ కోసం సన్నాహాలు !



డైరెక్టర్ క్రిష్, అనుష్క ప్రధాన పాత్రలో 'ఘాటీ' అనే ఫిమేల్ ఓరియెంటెడ్ సినిమాని తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 18వ తేదీన రిలీజ్ కాబోతుంది. ఇప్పటికే, 80 శాతం షూటింగ్ ను పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా ఆల్ రెడీ మొదలైంది. ఇక వచ్చే షెడ్యూల్ లో ఈ సినిమా క్లైమాక్స్ ను షూట్ చేయడానికి సన్నాహాలు చేసున్నారు క్రిష్. ఈ క్లైమాక్స్ షూట్ పూర్తి అయ్యాక, అనుష్క తన పాత్రకు డబ్బింగ్ ను కూడా పూర్తి చేస్తారట. ఈ క్లైమాక్స్ షూట్ ను జనవరి ఎండింగ్ లో తీసే అవకాశం ఉంది.

కాగా ప్రస్తుతం అనుష్క మలయాళంలో ఓ సినిమా చేస్తుంది. ఆ సినిమాతో పాటు ఘాటీ సినిమాలో మాత్రమే అనుష్క నటిస్తోంది. ఇక ఈ చిత్రం థియేటర్ లో రిలీజ్ అయిన తర్వాత ఘాటీ అమెజాన్ లోకి రానుంది. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా మూవీగా మేకర్స్ రూపొందించారు. ఈ సినిమాను ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, యూవీ క్రియేషన్స్ బ్యానర్లు సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నాయి. ఈ సినిమా పై మంచి అంచనాలు ఉన్నాయి.

## జనవరి 3న 'దిల్ రూబ' టీజర్



యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం రీసెంట్ గానే తన కెరీర్ లోనే సాలిడ్ హిట్ "క" తో అందుకున్న సంగతి తెలిసిందే. కొంచెం గ్యాప్ తీసుకొని చేసిన ఈ చిత్రం మొన్న దీపావళి కానుకగా వచ్చి అదరగొట్టింది. తన కెరీర్ లో బిగ్గెస్ట్ గ్రాసర్ గా నిలిచింది. అయితే ఈ చిత్రం తర్వాత తన నుంచి రాబోతున్న లేటెస్ట్ చిత్రమే "దిల్ రూబ".

దర్శకుడు విశ్వ కరుణ తెరకెక్కించిన ఈ చిత్రం నుంచి మేకర్స్ టీజర్ అప్డేట్ ఇచ్చేసారు. దీనితో ఈ టీజర్ కట్ ని మేకర్స్ జనవరి 3న రిలీజ్ కి తీసుకొస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. అలాగే ఈ చిత్రాన్ని ఈ రానున్న ఫిబ్రవరిలో రిలీజ్ కి తీసుకొస్తున్నట్టుగా కూడా కన్ఫర్మ్ చేశారు. మరి ఈ డేట్ ఇంకా కన్ఫర్మ్ కావాల్సి ఉంది. ఇక ఈ చిత్రంకి "క" సినిమా సంగీత దర్శకుడే సామ్ సి ఎస్ వహిస్తుండగా యూడ్ లీ ఫిలిమ్స్ వారు నిర్మాణం వహిస్తుండగా ఈ సరిగమ వారి సమర్పణలో ఈ చిత్రం రాబోతుంది.